జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## నేడు విదేశాల నుంచి చంద్రబాబు రాక

అమరావతి, మహానాడు:



విదేశీ పర్యటకు వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం హైదరాబాద్‌కు రానున్నారు. పోలింగ్ తరువాత ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. అమెరికా నుంచి బయలుదేరి బుధవారం ఉదయం 8.30కు హైదరాబాద్ చేరుకోనున్నారు. విమానాశ్రయంలో పార్టీ నేతలు స్వాగతం పలకనున్నారు. అనంతరం జూబ్లీహిల్స్ నివాసానికి చేరుకుంటారు.



# ‘పాట’ లొల్లి!

- అందెశ్రీ పాటకు కీరవాణి సంగీతంపై వివాదం
- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు సన్మానించిన కేసీఆర్
- ఇంకా ఆంధ్రావాళ్ల పెత్తనమేంటన్న ఆర్ఎస్ ప్రవీణ్
- అంతకుముందు తెలంగాణ మ్యుజీషియన్ అసోసియేషన్ అభ్యంతరం
- మేఘా కృష్ణారెడ్డి కాళేశ్వరం కట్టినప్పుడు మాట్లాడలేదేం?
- యాదాద్రి డిజైన్ ఆనంద్ సాయి చేసినప్పుడు గొంతు పెగలలేదేం?
- అశోక్ తేజ అమరావతి గీతం రాసినప్పుడు అడ్డుకోలేదేం?
- బీఆర్ఎస్‌పై సోషల్మీడియా వ్యంగ్యాస్త్రాలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

“ఈమధ్యనే బీఆర్ఎస్లో చేరిన ప్రవీణ్ కుమార్ అసలు కేసీఆర్ స్కూలు సిలబస్ సరిగా స్టడీ చేసినట్లులేరు. సారు కెమిస్ట్రీ, పాలిటిక్స్, అకౌంట్స్ ఇంకా స్టడీ చేయకుండా మాట్లాడితే ఆయనకే ఇబ్బంది. ముందు ప్రవీణ్, కేసీఆర్ సారు స్కూలు సిలబస్ ను స్టడీ చేసి మాట్లాడితేనే ఇజ్జత్ ఉంటుంది”

– తెలంగాణ రచయత అందెశ్రీ రాసిన జయహే జయహే తెలంగాణ పాటకు స్వరసంగీతం అందించే బాధ్యతను, తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి.. ఆంధ్రా సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణికి అప్పగించడంపై బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఖండించిన క్రమంలో, సోషల్మీడియాలో వెల్లువెత్తిన వ్యంగ్యాస్త్రాల్లో ఇదొక అస్త్రం!

కీరవాణికి జయజయహే తెలంగాణ పాటకు సంగీత బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్.. స్వయంగా ఆయన ఆఫీసుకు వెళ్లి, స్వరాల కూర్పుపై చర్చించారు. ఆ ఫొటోలు మీడియాలో వచ్చినవే. అక్కడ పాట రాసిన అందెశ్రీ కూడా ఉండటాన్ని విస్మరించకూడదు. అయితే ఆంధ్రా వాడయిన కీరవాణికి, తెలంగాణ పాట సంగీత బాధ్యతలు అప్పగించడం ఏమిటి? అన్నది ఇప్పుడు మొదలయిన ‘పాట’ పంచాయతీ! పదేళ్లు తెలంగాణను వెలిగించిన బీఆర్ఎస్ పార్టీనే, ఈ పంచాయితీకి తెరలేపటం విశేషం. ఆ పార్టీలో ఇటీవలే చేరి, ఎంపీ సీటుకు పోటీచేసిన మాజీ ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ దానికి సంబంధించి లేటెస్టుగా ఒక ట్వీటు చేశారు.

అందెశ్రీ తెలంగాణ రాష్ట్ర గీతంపై ఆంధ్రా సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పెత్తనం ఏంది బై? గీత సర్వకల్పనకు మళ్లీ ఇప్పుడేం అవసరమొచ్చింది? అయినా తెలంగాణ కవులపై ఆంధ్ర సంగీత దర్శకుల పెత్తనం ఇంకెంత కాలం? అదీ తెలంగాణ వచ్చి పదేళ్లయినంక ??”. ఇదీ ప్రవీణ్ కుమార్ ట్వీటిన ట్వీటు. ఆ ట్వీట్లో జత చేసిన ఫొటోకు, సీఎం రేవంత్ రెడ్డి– కీరవాణితో పాటు పాట రాసిన అందెశ్రీ చర్చిస్తున్న దృశ్యం కూడా కనిపిస్తోంది.

మిగతా.. 2లో



## అమరావతిలో మళ్లీ

# ‘భూమ్’ ధామ్

- అమరావతిలో భూముల ధరలకు రెక్కలు
- కూటమికే అధికారం స్పష్టమైన అంచనాలతో పెరిగిన భూముల ధరలు
- క్యాపిటల్ ఏరియాలో గజానికి పదివేలు పెరుగుదల
- గెలుపోటములపై ఒక్కసారిగా మారిన లెక్కలు
- ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న రియల్ వ్యాపారం
- ఎకరం కోటికి పైనే...అయినా అమ్మేవారు లేరు
- రాజధాని ప్రాంతం చుట్టూ రియల్ వ్యాపారుల చక్కర్లు
- ఐదేళ్ల అరాచక పాలన పోతుందన్న ఆనందంలో రైతులు
- నో అడ్వాన్స్ డైరెక్ట్ వన్ వీక్‌లో రిజిస్ట్రేషన్

(వాసిరెడ్డి రవిచంద్ర)

ఏపీ రాజధాని అమరావతి సీఆర్‌డీఏ పరిధిలోని భూములకు అమాంతంగా రెక్కలు వచ్చాయి. రెండురోజులుగా భూముల ధరలు ఆకాశాన్నంటాయి. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారం ఖాయమన్న సంకేతాల నేపథ్యంలో అమరావతి ప్రాంత భూముల ధరలు పెరిగిపోయాయి. జగన్ ప్రభుత్వంలో గత ఐదేళ్లు మూడు రాజధానులు ఆటతో అమరావతి రాజధాని ఉంటుందో ఉండదోనన్న అనుమానాల నేపథ్యంలో అభివృద్ధి కుంటుపడింది. రియల్ ఎస్టేట్ పడిపోయింది. 2014 తర్వాత స్వచ్ఛందంగా తుళ్లూరు ప్రాంతంలో రైతుల వద్ద గత చంద్రబాబు ప్రభుత్వం 36 వేల ఎకరాల భూమిని సేకరించి అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంగా నిర్ణయించి కొంతమేరకు అభివృద్ధిని ప్రారంభించారు. తాత్కాలిక భవనాల పేరుతో సచివాలయ భవనాలు, ఐఏఎస్ అధికారుల భవనాలు, అభివృద్ధికి సంబంధించిన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు ప్రారంభించి అభివృద్ధికి పునాదులు వేశారు.

### మూడు రాజధానులతో పడిపోయిన ధరలు

2019లో జగన్ అధికారం చేపట్టిన వెంటనే అమరావతిని అటకెక్కించారు. కేవలం శాసన రాజధాని అమరావతి, విశాఖ పరిపాలన రాజధాని, కర్నూలు న్యాయ రాజధాని అని అసెంబ్లీ సాక్షిగా బిల్లు ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో అమరావతి రాజధాని ఉంటుందా లేదా అన్న అనుమానాలకు ఆస్కారమిస్తూ గత ఐదేళ్లు జగన్ పాలన సాగింది. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు ఐదేళ్ల పాటు అలుపె రగకుండా న్యాయస్థానాలలో అదేవిధంగా బయట పోరాటాన్ని సాగించారు. దీంతో అక్కడ భూముల ధరలు సగానికి సగం పడిపోయాయి.

### రెండు రోజుల్లో మారిన లెక్కలు

అయితే ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి మా భూములకు పాత ధరలు వచ్చాయి. ఎన్నికలు ముగిశాక ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందా? తిరిగి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందా? అన్న అనుమానాలతో ఎవరి లెక్కలు వారు వేశారు. జగన్ ప్రభుత్వం ఏర్పడుతుందని జూన్ 9న ముహూర్తంగా నిర్ణయించి విశాఖ రాజధానిగా అక్కడ ప్రమాణ స్వీకారం చేస్తారని జగన్ అండ్ కో ప్రచారాన్ని చేశారు. జగన్ లండన్ వెళుతూ ఐప్యాక్ టీంతో తిరిగి మనం అధికారాన్ని చేపడుతున్నాం..

మిగతా.. 2లో




## హరీష్‌రావు అండతోనే

# ఫోన్ ట్యాపింగ్!

- బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారిన వారే టార్గెట్
- విచారణలో వెలుగులోకి కీలక విషయాలు
- మీడియా యజమాని పాత్ర కీలకం
- మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు వాంగ్మూలం



హైదరాబాద్, మహానాడు:

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మరో నిందితుడు వాంగ్మూలంలో సంచలన విషయాలు బయట పెట్టారు. బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారిన వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు వెల్లడిరచారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో

మిగతా.. 2లో

## పిన్నెల్లికి బెయిల్ మంజూరు



అమరావతి,మహానాడు: పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు మంగళవారం వివిధ కేసులలో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆయన ప్రతిరోజూ పల్నాడు జిల్లా ఎస్పీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని సూచించింది. మాచర్ల వెళ్లకూడదని, నరసరావు పేటలో ఎక్కడ ఉంటారో పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్ పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అందజేయాలని పేర్కొంది. పాస్‌పోర్టు కోర్టులో సరెండర్ చేయా లని ఆదేశించింది.



ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబ సభ్యులు

# అటువంటి వెధవ పనులు నేను చేయను

- ఫోన్ ట్యాపింగ్‌పై స్పందించిన రేవంత్ రెడ్డి
- అధికారులు వారి పని చేసుకుపోతున్నారు
- వారు ముగ్గురూ సీబీఐ విచారణ ఎందుకు కోరలేదు?
- ఇప్పటివరకు ఆ వ్యవహారంపై సమీక్షించలేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ, మహానాడు:

ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎలా వెలుగులోకి వచ్చిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఇప్పటివరకు సీఎంగా సమీక్ష జరపలేదు. అధికారులు వారి పని వారు చేసుకుంటూ పోతున్నారు. వాళ్ల పనిలో జోక్యం చేసుకుంటే ఏం జరుగు తుందో తెలుసు. ఇప్పుడు దర్యాప్తు చేస్తున్న అధికారులు ఇలాంటి విషయాల్లో ఎవరిమాటా వినే వారు కాదు. అన్నింటికీ సీబీఐ విచారణ కోరే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు... ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చాం. అధికార మార్పిడి జరిగిన తర్వాత చోటు చేసుకున్న అధికారుల బదిలీల్లో ఎస్ఐబీ కార్యాలయంలో కొన్ని వస్తువులు మిస్ అయినట్లు బయటపడిరది. వాటికి సంబంధించిన విషయంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఎవరెవరు బాధ్యులో తేల్చే క్రమంలోనే ట్యాపింగ్ వ్యవహారం బయటకు వచ్చింది. ఆ తర్వాత కేసులో టెలిగ్రాఫ్ చట్టం సెక్షన్లు జోడిరచి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



కనపడకుండా పోయిన హార్డ్ డిస్క్‌లు, ధ్వంసం అయిన బ్యాకప్ డేటా ఎక్కడ ఉందో విచారణ అధికారులే తేల్చాలి. తెలంగాణ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ జరపడం లేదు..అటువంటి వెధవ పనులు నేను చేయను. తీవ్రవాదులు, జాతి వ్యతిరేక శక్తుల విషయంలో ఫోన్ ట్యాపింగ్ జరగొచ్చు. అందుకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ఎస్ఐబీ అధికారులు కేంద్ర నిఘా సంస్థలతోనే నేరుగా మాట్లాడుతారు తప్ప.. నాతో కాదు. 1980, 90 నుంచి సేకరించిన డేటా అంతా ఉందో లేదో, బ్యాకప్ కూడా ఉందో లేదో, దాన్ని కూడా మాయం చేశారో అంతా దర్యాప్తు అధికారులకు తెలుస్తుంది.



## ప్రశాంత కౌంటింగ్

# చర్యలు చేపట్టాలి

- జూన్ 4న రాష్ట్రమంతటా 144 సెక్షన్
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా
- నరసరావుపేటలో డీజీపీతో కలిసి స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

2లో

## ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు



9లో

## లిక్కర్ స్కామ్ విచారణలో కేసీఆర్ ప్రస్తావన



9లో

## తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్



9లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024

# 'పాట' లొల్లి!

(మొదటిపేజీ తరువాయి..)

అన్నట్లు.. అందెశ్రీ రాసిన ఆ పాటను రాష్ట్రగీతంగా ప్రకటించకుండా కేసీఆర్ సర్కారు పదేళ్లు పాతరేశారు. రేవంత్రెడ్డి సీఎం అయితేనే గానీ ఆ పాటకు రాష్ట్రగీతం మోక్షం కలగలేదు. దానిపై స్వయంగా కవి అందెశ్రీ ఆవేదన ఇప్పుడు సోషల్మీడియాలో పరవెళ్లుతోంది. 'కేసీఆర్ నియంతృత్వం-అహంకారానికి నా పాట బలయిపోయిందన్నది అందెశ్రీ ఆవేదన. అది వేరే విషయం.

దీనిపై సోషల్మీడియాలో బీఆర్ఎస్పీ వ్యంగ్యాస్త్రాలు శరపరంపరగా షురవయ్యాయి. మరికొందరు ఔత్సాహికులయితే.. టీఆర్ఎస్ పదేళ్ల జమానలో అదే ఆంధ్రావాళ్లకు పట్టం కట్టిన వైనాన్ని, ఫొటోలతో సహా గుర్తు చేసి సర్ఫ్ ఉతికి ఆరేస్తున్నారు. "మొన్నీమధ్యనే బీఆర్ఎస్ స్కూల్లో చేరిన ప్రవీణ్ కు అసలు కేసీఆర్ సిలబస్ గురించి ఏమీ తెలియదు. అసలాయన మొదటిపేజీ కూడా చదవలేదని ఆ ట్వీటే చెబుతుంది" అంటూ సెటైర్ల వర్షం కురిపిస్తున్నారు.

ఉద్యమ సమయంలో తెలంగాణ సమాజాన్ని ఉర్రూతలూగించి, పిడికిలి బిగించేలా చేసిన జయహే జయహే తెలంగాణ పాట పాడింది ఎవరో తెలుసా? ప్రముఖ నేపథ్య గాయకుడు రామకృష్ణ, ఆయన ఆంధ్రా ఆయనే. మరి రామకృష్ణతో జయజయహే తెలంగాణ పాట పాడించిప్పుడు ఎందుకు అభ్యంతరం చెప్పలేదన్నది నెటిజన్లు సంధిస్తున్న ప్రశ్న. 'తెలంగాణ తిరుపతి'గా మార్చిన యాదాద్రి దేవాలయాన్ని, డిజైన్ చేసింది ఎవరంటే అదే ఆంధ్రాకు చెందిన ఆనందాయి. స్వయంగా కేసీఆర్ సారే ఆయనకు ఆ బాధ్యతలు కట్టబెట్టిండు మరి! ఇక జీయర్ స్వామి ఉన్నారు కదా? ఆ ఆంధ్రాకు చెందిన ఆ స్వామిని, తెలంగాణ స్వామిగా మార్చిన ఘనత కూడా సారుదే. అంతేనా.. విశాఖ స్వామి స్వరూపానందకు హైదరాబాద్ లో గజం రూపాయి చొప్పున భూమిని ధారాదత్తం చేసింది కూడా మన సారే!

అక్కడితో అయిపోలేదు తమ్మీ కాళేశ్వరం ప్రాజెక్టును స్వయంగా డిజైన్ చేసి, అసెంబ్లీలో వాటి ఎత్తుపల్లాలను టార్చిలైటు వేసి మరీ వివరించిన మన గ్రేట్ కాశేశ్వరరావు, ఆ ప్రాజెక్టు ఎవరికి ఇచ్చారో తెలుసా? ఆంధ్రాకు చెందిన మేఘా కంపెనీకి. ది గ్రేట్ కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డి కంపెనీకి కట్టబెట్టిండు. అసలు ఆ ప్రాజెక్టు ఓపెనింగు ఏపీ సీఎం జగన్రెడ్డి సాక్షిగా జరిగిందే. ఆ మాటకొస్తే.. ఆ రెడ్డి ఒక్కడికే కాదు. ఇంకా వైసీపీకి చెందిన చాలామంది రెడ్లకు, తెలంగాణ కాంట్రాక్టు-సబ్ కాంట్రాక్టులు కట్టబెట్టిన ఘనత మన సారుదే. ఇక గొర్రెలు-గేదల పథకంలో లబ్ధిపొందిన వారిలో సగానికి పైగా గోదావరి జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లే.

ఇంకిట్లా సారు ఘనత గురించి చెప్పుకుంటూ రాస్తే రామాయణం. మాట్లాడితే మహాభారతం అవుతుంది. అన్నట్లు.. ఇప్పుడు జయజయహే తెలంగాణ పాటకు ఆంధ్రా సంగీత దర్శకుడికి బాధ్యతలు అప్పగించటాన్ని ఖండించిన ప్రవీణ్ కుమార్ కు .. కేసీఆర్ సారు సీఎంగా ఉన్నప్పుడు, ఇదే కీరవాణి అనే ఆంధ్రా సంగీత దర్శకుడికి ఆస్కార్ అవార్డు లభించిన్పుడు.. ఇదే కేసీఆర్ సర్కారు మహా సంబరపడి, ఆయనను పిలిపించి సన్మానం చేసిన విషయం గుర్తుకురాకపోవడమే వింత.

అయితే అప్పుడు ప్రాంతీయ పార్టీ టీఆర్ఎస్ అధ్యక్షుడు కాదు. బీఆర్ఎస్ అనే భారతీయ-జాతీయ- భావాలున్న పార్టీ కాబట్టి.. బహుశా అలాంటి విశాల జాతీయ హృదయంతో ఇదే కీరవాణిని సన్మానించారు. మరిప్పుడు అధికారంలో లేరు కాబట్టి.. పాట పంచాయితీ పెట్టినట్లున్నారు. అన్నట్లు మేఘా కృష్ణారెడ్డికి కాళేశ్వరం కాంట్రాక్టు ఇచ్చినప్పుడు.. కృష్ణారెడ్డి కంపెనీ టాలెంట్ చూసి, కాంట్రాక్టు ఇచ్చినట్లు అప్పటి మంత్రులు సెలవిచ్చారు. మరి ఆ సూత్రం కీరవాణికి వర్తించదేమో?!.. అన్నది సోషల్ మీడియాలో బీఆర్ఎస్పై వెల్లువెత్తుతున్న విమర్శనాస్త్రాలు.

స్వర సంగీత కూర్పుపై స్వయంగా కీరవాణితో, సీఎం రేవంత్రెడ్డి చర్చించిన సమయంలో.. అసలు ఆ పాట రాసిన రచయిత అందెశ్రీ కూడా అక్కడే ఉండటం విశేషం. ఇప్పటిదాకా ఆయన తన పాటకు సంగీత బాధ్యతను కీరవాణికి ఇవ్వడంపై అభ్యంతరం చెప్పలేదు. మరి మౌనం అంగీకారన్నట్లే కదా? " ఇది ఊళ్లో పెళ్లికి కుక్కల హడావిడి లెక్క ఉంది. అసలు పాట రాసిన అందెశ్రీ అన్న మౌనంగా ఉంటే, మిగిలినవాళ్లు మొరుగుతున్నరు. అట్లాంటి అభ్యంతరాలుంటే మాట్లాడాల్సింది అందెశ్రీ అన్న మాత్రమే. వీళ్లు కాదు కదా" అని నెటిజన్లు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

# అమరావతిలో మళ్లీ 'భూమ్' ధామ్

(మొదటిపేజీ తరువాయి..)

151 సీట్లు వస్తున్నాయని నమ్మించే ప్రయత్నం చేశారు. ఇలా ఎవరి లెక్కలు వారు వేస్తూ భారీగా బెట్టింగులు కూడా వేశారు. అయితే గత రెండు రోజులుగా అంచనాలు తలకిందులు అవడం ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం అధికారం ఖాయమన్న వార్తల నేపథ్యంలో అమరావతిలో ధరలకు రెక్కలు వచ్చా యి. మోదీ, అమిత్షా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రకటన చేయడంతో మరింత స్పష్టత పెరిగింది. దాంతో టీడీపీ శ్రేణులు గెలుపుపై భారీ అంచనాలతో బెట్టింగులకు సై అనడం...వైసీపీ శ్రేణులు వెనకడుగు వేయడం




తో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని స్పష్టమైన సంకేతాలు వెలుపడ్డాయి.

### ఎకరం కోటి పైనే...అయినా అమ్మేవారు లేరు

జగన్ న్యాయవాది పొన్నులేటి సుధాకర్రెడ్డి కన్నీరు కారుస్తూ జగన్ను కాపాడు కోవాలని చేసిన వ్యాఖ్యలపై వైసీపీ శ్రేణులను డీలా పడేలా చేశాయి. దాంతో తెలుగుదేశంలో రెట్టింపు ఉత్సాహం మొదల్కొంది. దీంతో కూటమి అధికారం ఖాయ మని.. స్పష్టంగా 115 సీట్ల వరకు వస్తాయని అంచనాల నేపథ్యంలో అమరావతి లో భూములకు రెక్కలు వచ్చాయి. నిన్నటి వరకు గజం రేటు రూ.25 వేలు ఉంది కాస్తా రూ.35 వేల వరకు పలుకుతోంది. రూ.35 వేలు ఉన్నది రూ.45 వేల వరకు పలుకుతోంది. ఈ రెండు రోజులలో పదివేలకు పైగా గజం రేటు పెరగడంతో అమరావతిలో తిరిగి రాజధాని ప్రారంభమవుతుంది.. చంద్రబాబు ముఖ్య మంత్రి అవుతారు అన్న అంచనాలు పెరిగిపోయాయి. అమరావతి చుట్టుపక్కల ప్రాంతాలలో పొలాల రేట్లు కూడా ఎకరం 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ధరలు పెరిగాయి. అమ్మేవారు లేకపోవడం...కొనడానికి ఎక్కువమంది ఆసక్తి చూపడంతో ధరలకు రెక్కలు వస్తున్నాయి. అంచనాలకు మించి అమరావ తిలో ధరలు పెరిగిపోయాయి.

### రియల్ వ్యాపారుల చక్కర్లు

అమరావతి అభివృద్ధి ప్రారంభమవుతుందన్న నమ్మకంతో ఎన్నారైలు, అదేవిధంగా హైదరాబాదు, వైజాగ్కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతిపై మమకారం ఉండి అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో అనేకమంది పెట్టుబడు లు పెట్టేందుకు ఉరకలు వేస్తున్నారు. దీంతో అమరావతిలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. జూన్ నాలుగు తర్వాత వీరి అంచనాలు నిజమై చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేస్తే గజానికి మరో రూ.10 వేలు ధర కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాజధానిలో భూముల కోసం వందలాది మంది పరుగులు తీస్తూ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అమ్మేవారు తక్కువ ఉండ డం.. కొనేవారు ఎక్కువ ఉండడంతో భూముల ధరలు నానాటికీ పెరిగిపోతు న్నాయి. రాజధాని రైతుల్లో మునుపటి ఆశలు చిగురించాయి. జగన్ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టినా కోర్టుల చుట్టూ తిరిగి ఉద్యమాలు చేశాం.. మా త్యాగం ఊరికే పోదు... అని ఆనాడు చంద్రబాబు నాయుడు చెప్పిన మాట నిజం అవడం తో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తుంది. మోదీ తిరిగి ప్రధాని కావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అవడంతో మా అమరావతి రాజధాని ప్రాంతం అవి రామంగా అభివృద్ధి చెందుతుందన్న ఆశతో ఉన్నారు. మరి అమరావతి రాజధాని ప్రాంతంలో ఈ ధరలు ఎంతవరకు వెళతాయో చూడాల్సి ఉంది.

# ప్రశాంత కౌంటింగ్ చర్యలు చేపట్టాలి

- జూన్ 4న రాష్ట్రమంతటా 144 సెక్షన్
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్కుమార్ మీనా
- నరసరావుపేటలో డీజీపీతో కలిసి స్ట్రాంగ్రూమ్ పరిశీలన

**నరసరావుపేట, మహానాడు:** పల్నాడు కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు లో మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్కుమార్ మీనా ఎన్నికల కౌంటింగ్ సన్నద్ధత, శాంతి భద్రతల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాత్కర్, ఎస్పీ మల్లికా గార్గ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకేష్కుమార్ మీనా మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా జూన్ 4న రాష్ట్రమంతటా 144 సెక్షన్ ఉం టుందని తెలిపారు. ప్రశాంత వాతావరణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నరసరావుపేట మండలం కాకాని జేఎన్టీయూ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. స్ట్రాంగ్రూమ్, కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలను పరిశీలించారు. టీడీపీకి చెందిన ఏజెంట్ను ఏర్పాట్లు, బందోబస్తుపై ఆరా తీశారు. కౌంటింగ్ రోజు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి గుర్తింపు ఉన్న వారిని మాత్రమే లోపలికి పంపాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినా యకం, రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజ ఉన్నారు.

### సీఈవో, డీజీపీని కలిసిన అధికారులు

అంతకుముందు తొలిసారి పల్నాడుకు వచ్చిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్కుమార్ మీనా, డీజీపీ హరీష్కుమార్ గుప్తాలను కలెక్టర్ శ్రీకేష్ లాత్కర్, ఎస్పీ మల్లికాగార్గ్, జేసీ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకం, ఆర్డీవో సరోజ మర్యాద పూర్వకంగా కలిశారు.

# చార్లెట్లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు



మహానటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, అభిమానుల ఆరాధ్యరాముడు నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను చార్లెట్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ సానుభూతిపరు లు హాజరై నివాళులర్పించారు. ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం చార్లెట్ నుంచి ఎంతోమంది ఎన్నారైలు ఆంధ్రప్రదేశ్కు వెళ్లి వారివారి నియోజకవర్గాల్లో ప్రచారం చేసి వచ్చారు. వారంతా తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి సాధించగలదని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పాలనలో ఏనాడు పూజలను అడ్డుకోలేదు

### ఇండియా కూటమి వస్తే ఇంటి పెద్ద ఖాతాలో డబ్బు

### పంజాబ్ ఎన్నికల ప్రచారంలో భట్టివిక్రమార్క



**పంజాబ్:** కాంగ్రెస్ తన 55 ఏళ్ల పరిపాలనలో ఏనాడు పూజా కార్యక్రమాలను అడ్డుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్కోట్ లోక్సభ నియోజకవర్గ పరిధిలోని కొట్కపుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిం చారు. సభకు ముందు ప్రధాన అతిథిగా విచ్చేసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు డిప్యూటీ సీఎం స్వాగతం పలికారు. కాంగ్రెస్ పేదల కోసం పని చేస్తుంటే బిజెపి మాత్రం కొద్ది మంది పెద్దల కోసం పనిచేస్తుందని ధ్వజమెత్తారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ఇంటి పెద్ద బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయల నగదు జమ చేస్తామన్నారు. జనాభా దామాషా ప్రకారం ఈ దేశ సంపద, వనరులు పంపిణీ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని వివరించారు.

# హరీష్రావు అండతోనే ఫోన్ ట్యాపింగ్!

(మొదటిపేజీ తరువాయి..)

విభేదాలున్న శంబీపూర్ రాజు, కడియం శ్రీహరితో విభేదాలున్న రాజయ్య, తాండూరు ఎమ్మెల్యేతో విభేదాలున్న పట్నం మహేందర్ రెడ్డి దంపతులపై నిఘా పెట్టినట్లు వాంగ్మూలంలో పేర్కొన్నారు. రేవంత్రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపైనా నిఘా పెట్టినట్లు వివరించారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్కుమార్, తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న, జానారెడ్డి కొడుకు రఘువీర్రెడ్డి, సరిత తిరుపతయ్య, జువ్వాడి నర్సింగరావు, వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణ, బీజేపీ నేతలు ఈటెల, బండి సంజయ్, అరవింద్ అనుచరులు, పలువురు మీడి యా యజమానుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు బయటపెట్టారు. హరీష్రావు అండతో ఓ మీడియా యజమాని ఆధ్వర్యంలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు వెల్లడిరచారు. ఆయన ఆదేశాలతో ప్రణీత్రావుతో డైరెక్ట్గా టచ్లోకి వెళ్లిన ఆ మీడియా యజమాని పలువురి ఫోన్లు ట్యాప్ చేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో వీఐపీల సమాచా రాన్ని ప్రణీత్రావుకు అందించినట్లు వాంగ్మూలంగా చెప్పారు. అప్పటినుంచి కాంగ్రెస్, బీజేపీ నేతలకు ధన సహాయం చేసే వారిపై నిఘా ఉంచారని తెలిపారు. కాగా ఈ వ్యవహారం ఇప్పుడు బీఆర్ఎస్ నేతల్లో గుబులు పుట్టిస్తోంది.



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, తెలుగువారి ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా ఈరోజు ఎన్టీఆర్ ఘాట్ వద్ద వారి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం వారి సమాధి వద్ద అంజలి ఘటించిన రఘురామకృష్ణంరాజు..




నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ఎన్నికల సమన్వయ కర్త, రాజ్యసభ మాజీ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్ పార్లమెంటులో యన్ టి ఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన దృశ్యం. చిత్రంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ



ఈరోజు ఎన్టీఆర్ ట్రస్టు సమావేశానికి విచ్చేసిన ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అజ్మీర రాజు నాయక్, జీవిజి నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్ నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలంపల్లి అశోక్ కుమార్



ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా ఆస్ట్రేలియాలో వేడుకలు నిర్వహించారు. ఎన్నారైలు సుబ్బారావు లగడపాటి గారులి, శ్రీకాంత్, గోపి, రామ్, హరీష్, వంశీ, ప్రకాష్, మెల్బోర్న్ సభ్యులు పాల్గొని కేక్ కట్ చేశారు.

### జగన్పై రాయి దాడి
# నిందితుడికి బెయిల్

**అమరావతి:** సీఎం జగన్పై రాయి దాడి కేసులో నిందితుడు సతీష్కు షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ జిల్లా కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. పోలీసు విచారణకు సతీష్ సహకరించాలని పేర్కొంది. ఏప్రిల్ 13న బస్సు యాత్ర సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజక వర్గంలో పర్యటిస్తున్న సమయంలో జగన్పై రాయి దాడి చేశాడన్న కారణంతో ఏప్రిల్ 18న సతీష్ను అరెస్టు చేశారు.

# వారణాసిలో ఈటెల బృందం ప్రచారం



**వారణాసి, మహానాడు:** తెలంగాణకు చెందిన ఈటల రాజేందర్ బృందం వారణాసిలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుంది. బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్, చాడ సురేష్రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, తిరుపతి యాదవ్, గంగాధర్ గౌడ్తో పాటు పలువురు నేతలు ఉన్నారు. సోనార్పూర్లో వారణాసి తెలుగు బ్రాహ్మణ సంఘం వారితో సమావేశమయ్యారు. మోదీకి ఓటు వేయాలని కోరారు.


జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

3

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024



# అతడే ఒక చరిత్ర!

ఒకే వ్యక్తి తానే
రాముడూ రావణుడైతే..
అదే వ్యక్తి భీముడు..దుర్యోధనుడు..
కీచకుడు..కిరీటిగా మారితే..
తానే కృష్ణుడు..కర్ణుడు
బృహన్నల..
ఇలా బహురూపాలు ధరిస్తే..
నవ మన్మధుడైన జగదేకవీరుడు..
పండు ముదుసలి భీష్ముడైతే..
వాల్మీకిగా మారి
రామాయణం విరచిస్తే..
బ్రహ్మం గారిగా
కాలజ్ఞానం చెబితే..
రాయల్ గా కృష్ణదేవరాయలైతే
గోపాలుడు..భూపాలుడైతే..
అగ్గి పిడుగుగా అవతరిస్తే..
బందిపోటుగా మారి అభిమానుల హృదయాలు
కొల్లగొడితే..
అతడే తిరుగులేని కథానాయకుడై..
ఒకనాటికి ఎదురులేని
మహానాయకుడైతే..
అతడు నందమూరి
తారక రామారావు కాక ఇంకెవరవుతారు?
మూడక్షరాల సంచలనం
ఆరు దశాబ్దాల చరిత్ర!

ఇలాంటి ఓ స్టార్
క్రికెట్లో ఉంటే
ఆల్ రౌండర్..
సినిమాల్లో గనక
ఆయనో వండర్..
ఆ అభినయం అనితరసాధ్యం
ఆ ఆహార్యం
వేరొకరికి అసాధ్యం..
ఆ ఉచ్చారణ ఓ ప్రేరణ..
సినిమాని ఒంటి చేత్తో
నడిపిన నాయకుడు..
రాజకీయాలను సింగిల్ హేండుతో శాసించిన
తెలుగుదేశాధీశుడు
అతడే ఒక సైన్యం
అన్నే ప్రభంజనం..!

అరవై నిండినా
అలుపెరుగని వయసు
ప్రజాసేవ వైపు
మళ్ళింది మనసు..
ఒక ఆలోచన..
శేషజీవితం
ప్రజలకే అర్పణం..
తెలుగుదేశం పార్టీకి అంకురార్పణం..
కాంగిరేసు వైభోగానికి తర్పణం..
ఎన్నో ఏళ్ల ఢిల్లీ పెద్దల
అచ్చున్న అప్పనం..
ఒక్క దెబ్బతో
ఈ అభినవ కృష్ణార్పణం!

తమిళ రాజకీయాల్లో
ఎంజీఆర్ ఒక శక్తి..
ఆయన రాజకీయ ప్రస్థానం
ఒక పరంపరా సన్నివేశం..
కాని నందమూరి
ఒక ఆవేశం..
అనూహ్య రీతిలో
పరకాయ ప్రవేశం..
అడుగు పెట్టింది
మొదలు సంచలనాలే..
తొలి ప్రయత్నంలోనే ఊహించని విజయం..
నాదెండ్ల ఉదంతంతో పడిలేచిన కెరటం..
జాతీయ రాజకీయాల్లో
ఉత్తుంగ తరంగం
కాంగ్రెస్ పతనానికి అతగాడి ప్రస్థానమే శ్రీకారం..
విపక్షాల ఐక్యతకు
ఎన్టీఆర్ ప్రవేశమే ఓంకారం..
ఆయన ఆవేశమే
హస్తం పార్టీకి తిరస్కారం..
అందుకు ఆయనకు
ఓ పెద్ద నమస్కారం..!

యాక్టరే కదాని
ఇందిరమ్మ అనుకుంటే
అణు రియాక్టరే కాలేదా..
రాజకీయాల్లోకి అడుగుపెట్టాక
తెలుగుజాతికి ఆయనే అయ్యాడు సమస్తం..
కాంగ్రెస్సుకు భస్మాసురహస్తం..
దేశమంతా
ఎన్టీఆర్ ప్రశస్తం..
ఆయన కీర్తి విశ్వవ్యాప్తం!

నటుడిగా ఎంతో..
రాజకీయ నాయకుడిగానూ అంతే..ఆయన ప్రస్థానం
మొత్తం ఓ వింతే..
రణం ఆయన గుణం..
నటన ప్రాణం..
జనం ఆయన గణం..
కారణజన్మ..
ఇందుకు ఆయన జీవితమే తిరుగులేని తార్కాణం..!

మొత్తానికి నందమూరి
వచ్చే వరకు కాంగ్రెస్
అహం బ్రహ్మస్మి
ఆ జగదేకవీరుడు పఠిస్తే
ఏకో అనేకో హమస్మి..
హస్తం హతోస్మి..
తెలుగుజాతిజి
ఆత్మగౌరవం ధన్యోస్మి..!


విశ్వవిఖ్యాత నటసార్వభౌమ
నందమూరి తారకరామారావు
జయంతి సందర్భంగా
నివాళి అర్పిస్తూ

-ఎలిశెట్టి సురేష్ కుమార్

9948546286

# అన్నగారికి అభిమానులే 'రక్ష'ణ

అన్న తారకరాముడు తెలుగుదేశం పార్టీ స్థాపించి, చైతన్యరథం ఎక్కినప్పుడు ఆయన వెంట తెలుగుప్రజలు



లక్షలాదిగా నడిచారు. వందలు.. వేలు.. లక్షల సంఖ్యలో జనవాహిని. తెలుగుదేశం పిలుస్తోంది. రా. కదలిరా అన్న ఆయన పిలుపే ఒక ప్రభంజనం. అయినా ఇప్పటిలా అప్పట్లో వందల సంఖ్యలో పోలీసుల భద్రత లేదు. ఒక ఎస్ఐ, ఐదారుగురు కానిస్టేబుళ్లు చైతన్యరథం చుట్టూ ఉండేవారు. ఉన్నదల్లా అన్నగారి అభిమానులు, అభిమానసంఘ నేతలే. వారే అన్నగారికి 'రక్ష'ణ. వందలాదిమంది అభిమానులు దగ్గరకొచ్చి అన్నను సం'దర్శించు'కునే వారు.

అయినా అన్నగారి ఎన్నికల ప్రచారం ఎలాంటి అపశృతులు లేకుండా.. అంటే చిన్న రాయి కూడా పడకుండా సాఫీగా జరిగింది. కానీ ఇప్పుడు సీఎం జగన్ వస్తుంటే.. వేలమంది పోలీసులు, చుట్టూ పరదాలు, చెట్టు నరికేయ డాలు, అడ్డంగా బారికేడ్లు! అయినా సరే తుంటరి గాళ్లు రాయి విసురుతున్న వైఫల్యం. నాటి ప్రచారంలో పోలీసులు చాలా తక్కువగా ఉండేవారు. ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది, అభిమాన సంఘాల వారు ఉండేవాళ్ళు ఆయన ఎలాంటి ఇబ్బంది లేకుండా 90 రోజుల్లో 30 వేల కిలో మీటర్లు ప్రయాణించారు. ఒక్కసారి మాత్రం హరికృష్ణకి అంచనా లేక చైతన్య రథం రైల్వే క్రాసింగ్ దాటే సమయంలో గడ్డర్ తగిలి గాయమైంది. తెలుగునేల ఉన్నంతవరకు ఆయన శాశ్వతం ఆయన కీర్తి అజరామరం.





# దైవం మానుష రూపేణ ఎన్టీఆర్

100 సంవత్సరాల క్రితం..

1923 మే 28 సోమవారం... దైవం. మానవ రూపంలో ఈ భువిపై వెలసిన.. సుదినం అది..పురాణ పురుషుడు.. శ్రీకృష్ణ జననం. కృష్ణాష్టమి పర్వదినం ఎలాగో తెలుగు వారికి ఈరోజు అంతే

ఇది తెలుగు జాతికి పండుగ రోజు.. తెలుగు నాట ప్రతి ఇంట తేదీ మరువని.. రోజు ఇది

ఎప్పుడా ఎప్పుడా అని. ప్రతి అభిమాని ఎదురుచూసే మహానాడు.

రానే వచ్చింది

అదే అదే ప్రతి రోజూప్రతి క్షణంప్రతి తెలుగు వాడి గుండెల్లో గూడుకట్టుకుని. కొట్టుకునే శబ్దం ఎన్టీఆర్ ..శత వసంతాల పుట్టినరోజు నేడేఈ భువిపై లేని వారి పుట్టినరోజుని "జయంతి". అనటం సహజం ..

ఈ భువిపై మనల్ని మైమరిపించి.దివిజనుల కోరిక మేరకు. కొన్ని నాళ్ళు దైవ లోకంలో కూడా తన నట ప్రదర్శనకు పయనమై వెళ్ళిన మరణం.. లేని మహా నటుడు ఎన్టీఆర్ .అసలు మరణమే లేని ఆ జననానికి జయంతి అనటం సరి కాదు. కనుక నేడు ఆయన జన్మదినమే .ఈ శతాబ్దమే కాదు. ముందు ముందు ఇంకా ఎన్నోయుగ యుగాలు. కొలిచే.ఈ భూమిని తాకిన మరుపు రాని ఆ సుందర రూపం. ఖచ్చితంగా పురాణ పురుషుడిదే ..

నూటికో కోటికో ఒక్కడే పుడతారు అంటారు

నూటికో కోటికో కాదు

నూరు జన్మలు ఎత్తినా

నీలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని . ఈ భువి పై చూడలేము

ఒక జన్మలోనే.వంద జన్మల సరిపడా ఘనకార్యాలు సాధించిన ఘనుడు దేముడు కాక పోతే ఇంకెవరు?

నీ నామ స్మరణే మాకు శ్లోకం

నీ భజనే మాకు భక్తి గీతం

నీ పాద ముద్రలు తాకిన ఈ నేల మాకు పుణ్యక్షేత్రం

ఇంటింట ఆత్మ బంధువు అయిన మీకు జన్మదిన శు భాకాంక్షలు.. రామన్న అంతిమంగా

దైవం మానుష రూపేణ ఎన్టీఆర్..

- దారపనేని నరేంద్రబాబు

(టీడీపీ మీడియా కో ఆర్డినేటర్)

## పేదవాడి ఆత్మగౌరవం కోసమే

# తెలుగుదేశం

1987వ సంవత్సరం పారిస్ నగరంలో పేదరికంతో కూడు కున్న ఆకలి, భయం మరియు హింసలవలన ఆందోళనకు గురైన బాధితులకు అండగా ఉండేందుకు "అందరూ కలసి గౌరవంగా జీవిద్దాం" (All Together in Dignity) వ్యవస్థాపకులు 'జోసెఫ్ రెసిన్ స్కిచే' పిలుపు మేరకు 'ఒక లక్ష మంది' గుమిగూడి పేదరిక నిర్మూలనకు సమ్మతి ప్రకటించడం జరిగింది. జోసెఫ్ రెసిన్ స్కిచే 1992 లో మరణించిన తరువాత ఐక్యరాజ్యసమితి అధికారికంగా అక్టోబర్ 17 వ తేదీ ని 'పేదరిక నిర్మూలన కొరకు అంతర్జాతీయ దినోత్సవంగా' ప్రకటించడం జరిగింది.

తెలుగుజాతి, తెలుగు ప్రజలు పేదరికంలో మగ్గకూడదు అని, కూడు-గుడ్డ-నీడ అనే నినాదంతో 'పేద ప్రజలే దేవుళ్ళు-సమాజమే దేవాలయం'గా భావించిన అన్న 'నందమూరి తారక రామారావు' "తెలుగుదేశం పార్టీ" స్థాపించి పేదవారికి కూడు-గుడ్డ-నీడ అందించి ఆత్మగౌరవం తో బ్రతికేలా చేశారు.

ప్రస్తుత 'తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు' కూడు-గుడ్డ-నీడ అందించడంతో పాటు ప్రజలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లాలనే క్రమంలో ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని, నేను పని చేస్తాను- మీరూ పని చేయండి అని ప్రభుత్వ ఉద్యోగులలో జవాబుదారీ పెంచడానికి ప్రయత్నించి వారి నిరసనలు ఎదుర్కోవలసి వచ్చింది.

ప్రభుత్వం అంటే ప్రజలకు జవాబుదారికానీ ప్రభుత్వ ఉద్యోగుల సోమరితనానికి (అప్పటి) వంతపాడటం కాదు, రాజకీయ అవసరాలకు, అధికార కాంక్షకు నిర్లప్తత తగదు అని భావించి, అభివృద్ధి- ఆదాయం పెంచడం అనే రెండువైపుల పదునైన కత్తిమీద సాముచేసి, నేటి రెండు తెలుగు రాష్ట్రాలలో ఆదాయం సృష్టించిన నేత..

ముఖ్యంగా ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్ - సికింద్రాబాద్ - సైబరాబాద్ లను రెండున్నర దశాబ్దాల క్రితమే ఆర్థిక స్వావలంబనకు బీజం వేసి, పెంచి పోషించి, అభివృధి చేసి ఫలాలు అందేనాటికి "ఇనిస్టెంట్ " మాయాజాల, టక్కుటమార, ఊసరవెల్లి రాజకీయాలకు, విద్వేష-విభజన, కులం-మతం-ప్రాంతం వంటి మాదకద్రవ్యాలకు మించిన మత్తు యువతకు ఎక్కించి, "తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో నారాచంద్రబాబు నాయుడు" సృష్టించిన ఆదాయవనరులను పప్పు బెల్లాలుగా భోంచేస్తూ ప్రజలకు పథకాల పేరుతో ఎంగిలి చేతులు విదిలించి వారి బానిసలుగా భావిస్తూ రాజ్యమేలుతున్నారు అక్కడా ! ఇక్కడా!!

పేదవారు తమ కాళ్ళమీద తాము నిలబడి, అందరూ ఆత్మగౌరవంతో జీవించాలి అనే సిద్ధాంతం 80 దశకం మొదట్లో



తెలుగుదేశం పార్టీ, అన్న ఎన్టీఆర్ , నారా చంద్రబాబు నాయుడు ,అదే 80వ దశకం చివర్లో "అందరూ కలసి గౌరవంగా జీవిద్దాం" వ్యవస్థాపకులు 'జోసెఫ్ రెసిన్ స్కిచే' చేసిన కృషి ఆదర్శం, ఆచరణీయం.

పేదరికం నుండి బయటపడాలంటే బానిసత్వంతో కాకుండా బాసటగా ఉండేవారికి పట్టం కడదాం. తెలుగుజాతి గుండెచప్పుడు అన్న ఎన్టీఆర్ స్వర్గానికెళ్లారు, ప్రపంచ పేదవారికై తాపత్రయపడిన జోసెఫ్ రెసిన్ స్కిచే అమరులైనారు.

తెలుగు ప్రజల ఆర్థిక పరిపుష్టే నా ధ్యేయం, తెలుగు యువత నైపుణ్యత మెరుగుపరుచుకుని ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలని తపించిన తపస్వి నారా చంద్రబాబు నాయుడు" అన్యాయపు, అసంబద్ధ, వక్రబుద్ధి 'త్రిమూరుల' కుట్రకి చెరసాలలో న్యాయ దేవత నిర్ణయానికి వేచివున్నారు.

- వేజెండ్ల కిషోర్ బాబు

రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,

పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు.

తెలుగుదేశం పార్టీ, తెలంగాణ.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 29, మే 2024

### ఒక రాజకీయ భూకంపం, ఒక పాలన సంస్కరణ

తెలంగాణ బహుజన నాయకుడు చేకూరి చైతన్య దాదాపు నాలుగు నెలల క్రితం.. అన్నా ఎన్టీ రామారావు మీద, ప్రస్తుత జాతీయ రాజకీయాల నేపథ్యంలో, అలాంటి నాయకుల అవసరం మీద ఒక ఆర్టికల్ రాయి అని మెసేజ్ పెట్టాడు. ఈ రోజు సరైన సందర్భం అనుకుంటున్నాను.

ఎన్టీఆర్ చనిపోయిన 25 సంవత్సరాల తర్వాత కూడా ఆయన గురించి మాట్లాడుకునేటప్పుడు, చాలామంది ఆయన సినిమా నటుడని, శ్రీకృష్ణుడని, శ్రీరాముడని చెబుతూ ఉంటారు.

వ్యాపారులను ప్రోత్సహించి నప్పటికీ, కాంగ్రెస్ లో కమ్మ నాయకులు ముఖ్యమంత్రి స్థాయికి ఎదగలేకపోయారు.

ఎస్సీ,ఎస్టీలను ఓటు బ్యాంకుగా చేసుకొని రెడ్ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌ని పాలిస్తున్న సామాజిక నేపథ్యంలో తెలుగుదేశం పుట్టింది.

జగన్మోహన్ రెడ్డికి ప్రశాంత్ కిషోర్ సహాయ పడినట్లు, ఆరోజు పర్వతనేని ఉపేంద్ర లాంటి ఎంతోమంది విద్యావంతులు, నాయకులు కాంగ్రెస్ పార్టీని ఓడించటానికి కావాల్సిన సోషల్ ఇంజనీరింగ్ మౌలిక సూత్రాలను ఎన్టీఆర్‌కి వివరించారు.

## తెలుగుదేశం స్థాపన
## ఒక సామాజిక విస్ఫోటనం

సినిమా నటుడు కాబట్టి ఎన్టీఆర్ గురించి ఇప్పటికీ ప్రజలు చెప్పుకుంటే మరి అక్కినేని నాగేశ్వర రావు గురించి అదే ప్రజలు ఎందుకు మర్చిపోయారు?

20వ శతాబ్దపు తెలుగు వాళ్ల చరిత్ర లో ఎన్టీ రామారావుని చిరస్మరణీయుడిగా మార్చడంలో, ఆయన సినిమా ఇమేజ్ పాత్ర చాలా తక్కువ.

38 ఏళ్ళ క్రితం, 60 ఏళ్ల వయసులో ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థాన ప్రారంభం ఒక సంచలనం.

1953లో ఆంధ్ర రాష్ట్రం, 1956లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత అంటే 1953 నుంచి 1983 వరకు ఒకే పార్టీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని /రాజ్యాన్ని పాలిస్తున్న నేపద్యంలో, దామోదరం సంజీవయ్య, పీవీ నరసింహారావు, జలగం వెంకటరావు లాంటి నాయకులు తప్ప ఒకే సామాజిక వర్గం ఆధిపత్యం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎదురు లేకుండా సాగుతున్న రోజుల్లో, తెలుగుదేశం స్థాపన ఒక సామాజిక విస్ఫోటనం, ఒక రాజకీయ భూకంపం, ఒక పాలన సంస్కరణ.

అత్యంత సాధారణ కమ్మ కుటుంబం లో పుట్టి, బీఏ వరకు చదువుకొని, మొన్న ఎన్నికల్లో లోకేష్ రాజకీయ ప్రయోగం చేసిన మంగళగిరిలో ఉద్యోగం చేసి, సినిమా రంగంలో వచ్చిన అవకాశాలతో కష్టపడి స్వయంకృషితో ఎదిగిన ఎన్టీఆర్, తన ఆస్తి మొత్తం కొడుకులకు కూతుళ్ళకు పంచి, తనకు అపారమైన కీర్తి సంపదల నిచ్చిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాజకీయాల్లోకి వచ్చాడు.

అప్పటికే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో బ్రాహ్మణుల ఆధిపత్యం అంతరించి, రెడ్ల ఆధిపత్యం స్థిరపడిపోయింది. ఈ రెడ్ల ఆధిపత్యాన్ని నియంత్రించే ప్రయత్నాలలో భాగంగా వెలమ నాయకుడైన జలగం వెంగళరావు కమ్మ నాయకులను,

అప్పుడు మొదలైంది తెలుగు రాజకీయాల్లో ఒక సామాజిక విప్లవం. ఫలితంగా అప్పటివరకు రాజకీయాల్లో అవకాశాలు రాక వెనుకబడిపోయిన రాయలసీమలో బలిజలు, బోయలు, మాదిగలు. ఉత్తరాంధ్రలో కొప్పుల వెలమలు, కాళింగులు తూర్పుకాపులు, తెలంగాణలో మున్నూరు కాపులు, మాదిగలు, బైండ్ల, గోండి, గౌడ లు, బ్రాహ్మణులు, ముదిరాజులు, కోస్తా జిల్లాల్లో కాపులు, రాష్ట్రంలోని 23 జిల్లాల్లో యాదవులు, ముస్లిం మైనారిటీ లు, మహిళలు పెద్ద ఎత్తున రాజకీయ అవకాశాలు పొంది చట్టసభల్లో ప్రవేశించారు.

ఎలాంటి ఆయుధాలు లేకుండా, ఎలాంటి రక్తపాతం లేకుండా భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు ద్వారా ఈ నిశ్శబ్ద,సామాజిక విప్లవం సాధ్యమైంది.

ఈ సామాజిక విప్లవం తెలంగాణలో ప్రకంపనలు సృష్టించింది. 1948లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై, భారత రాజ్యాంగం ప్రకారం పాలన జరుగుతున్నప్పటికీ తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ, భూస్వామ్య భావజాలం పటిష్టంగా ఉండటం వలన, గ్రామీణ పెత్తందారులు అయిన పటేల్, పట్వారీ వ్యవస్థలు ప్రజలను అణచివేస్తూ, దోచుకుంటూ బాంచన్ దొరా నీ కాల్ మొక్కుతా సంస్కృతిని కొనసాగిస్తున్న తెలంగాణ సమాజానికి తెలుగుదేశం పార్టీ స్థాపన, ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కావటం, పటేల్ పట్వారీ, వ్యవస్థలు రద్దు కావటం నక్సలైట్ విద్యార్థి సంఘం లో పనిచేసే ఇంద్రా రెడ్డి లాంటి అగ్రకుల అభ్యుదయవాదులు, మోత్కుపల్లి నర్సింహులు నాటి చైతన్యవంతులైన దళిత యువకులు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్ నుండి డైరెక్ట్ గా ఎమ్మెల్యేలు, మంత్రులు కావటం, ఊహకు కూడా అందని సామాజిక సంచలనం.

పైన చెప్పిన కులాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆయన వాళ్ళల్లో 90% పేద కుటుంబాల నుంచి వచ్చిన వారే. మరో విధంగా చెప్పాలంటే తెలుగుదేశాన్ని స్థాపించడం ద్వారా ఎన్టీఆర్ తెలుగు సమాజానికి అన్ని కులాల నుంచి విద్యావంతులైన, చైతన్యవంతులైన నూతన నాయకులను అందించాడు. (వాళ్ళలో కొంతమంది దళిత, బీసీ నాయకులు వందల కోట్లకు అధిపతులై, సొంత వారినే అణిచివేయడం ఒక విషాద వాస్తవం)

తెలుగుదేశం పార్టీ స్థాపించడం ద్వారా ఎన్టీఆర్ తెచ్చిన సామాజిక విప్లవం లో అత్యంత కీలకమైనది రాజకీయాలలో, పరిపాలనలో, చదువులో, ఆఖరికి ఆస్తిలో కూడా స్త్రీలకు ఎక్కువ అవకాశాలు కల్పించడం. ఫలితంగా అన్ని కులాలలో చదువుకున్న మహిళలు నాయకత్వ అవకాశాలు పొందారు.

రెండేళ్ల క్రితం తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో పేలిన ఒక జోక్ ఏంటంటే .. కెసిఆర్, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి మొదలైన వారిని చూసిన తర్వాత ఇది టీఆర్ఎస్ క్యాబినెట్ సమావేశమా? టిడిపి క్యాబినెట్ సమావేశమా? అని ఒక మంత్రి వ్యాఖ్యానించడం.

ఆఖరికి ఆంధ్రప్రదేశ్లో కొద్ది రోజుల క్రితం శాసన మండలి ఎన్నికలలో జగన్ ఎన్నిక చేసిన కడప జిల్లాకు చెందిన సి రామచంద్రయ్య గారిని చూసినప్పుడు నాకు కూడా ఎన్టీఆర్ సృష్టించిన నాయకులు గుర్తొచ్చారు.

ఎన్టీఆర్ తీసుకొచ్చిన సామాజిక మార్పుల తర్వాత మరో కీలకమైన అంశం కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఎన్టీఆర్



ప్రభావం.

1952, 57, 62 .. మూడు సాధారణ ఎన్నికలలో, కేంద్రంలో మరియు రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది (1957లో కేరళ తప్ప). కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులను, హై కమాండ్ నిర్ణయిస్తుంది కాబట్టి, రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని, ప్రణాళిక సంఘం లో కేంద్రం పెత్తనాన్ని, జాతీయ అభివృద్ధి మండలి లో ముఖ్యమంత్రులు ప్రశ్నించే వాళ్ళు కాదు.

కానీ 1967 సాధారణ ఎన్నికలలో దేశంలోని పద్నాలుగు రాష్ట్రాలలో, తొమ్మిది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి, కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

ఈ కాంగ్రెస్సేతర ప్రభుత్వాలలో .. తమిళనాడు ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, పంజాబ్ ప్రభుత్వం కేంద్రం పెత్తనాన్ని నిరసిస్తూ, కేంద్ర- రాష్ట్ర సంబంధాలపై ఒక కమిషన్‌ని నియమించాలని, కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. కానీ రాజ్యాంగాన్ని కూడా దిక్కరించి నియంతలా పరిపాలించిన ఇందిరాగాంధీ పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలో 1983లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, దేశంలోని కాంగ్రెసేతర పార్టీల ముఖ్యమంత్రులను, ప్రధాన నాయకులను విజయవాడ ఆహ్వానించి బ్రహ్మాండమైన బహిరంగ సభ నిర్వహించి కేంద్రం మిథ్య (ఉంది అనుకుంటే ఉంది, లేదు అనుకుంటే లేదు) అని ప్రకటించి, ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలన్నింటికీ కొత్త నాయకుడిగా అవతరించాడు.

1966లో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్,

1969లో తమిళనాడు ప్రభుత్వం నియమించిన రాజ మన్నార్ కమిటీ, 1973లో పంజాబ్‌లో చేసిన ఆనందపూర్ సాహిబ్ తీర్మానం, 1977లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సమర్పించిన మెమోరాండంలో..

ఇలా ఎన్నోసార్లు, ఎన్నో కమిటీలు కేంద్ర రాష్ట్ర సంబంధాలను మళ్లీ అధ్యయనం చేయాలి, రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం ఆపేయాలి.. భారత రాజ్యాంగం ఏర్పాటుచేసిన సమాఖ్య వ్యవస్థను అమలు చేయాలి, అకారణంగా రాష్ట్రాలలో ప్రభుత్వాన్ని రద్దు చేసి, రాష్ట్రపతి పాలన పెట్టకూడదు,

రాష్ట్రాల పాలనా వ్యవహారాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుల జోక్యం ఉండకూడదని ఎన్నిసార్లు చెప్పినా స్పందించని ఇందిరాగాంధీ.. ఎన్టీఆర్ ప్రభంజనానికి భయపడి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన కొద్ది నెలల్లోనే కేంద్ర రాష్ట్ర సంబంధాల అధ్యయనం కోసం 1983లో సర్కారియా కమిషన్‌ని నియమించింది.

రాజకీయాలలో ఎవరికీ భయపడని ఇందిరాగాంధీ, ఎన్టీఆర్‌కి భయపడింది అని ఈ ఒక్క నిర్ణయంతో, జాతీయ స్థాయి కాంగ్రెసేతర నాయకులకు స్పష్టంగా అర్థమైంది. అందుకే ఒక్కసారి కూడా పార్లమెంట్ కి పోటీ చేయని ఎన్టీఆర్‌ను నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.(1984లో లోక్ సభలో,అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం, 1989లో ఆంధ్రప్రదేశ్లో గెలుచిఉంటే, ఎన్టీఆర్, వి.పి.సింగ్ స్థానంలో ప్రధాన అయ్యేవాడు).

1988లో సర్కారియా కమిషన్ నివేదిక సమర్పించిన నాటి నుండి 2007లో కేంద్ర రాష్ట్ర సంబంధాల పై పూంఛీ కమిషన్ ను నయమించేంత వరకు, అనేక రాష్ట్రాల్లో అకారణంగా రాష్ట్రపతి పాలన రాకుండా కాపాడింది, సర్కారియా కమిషన్ సిఫా రసులే. అది జాతీయ రాజకీయాలపై ఎన్టీఆర్ వేసిన చెరగని ముద్ర.

1971లో మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత (1966 మొదటిసారి, లాల్ బహదూర్ శాస్త్రి మరణం తర్వాత, 1967 రెండవ సారి, సాధారణ ఎన్నికల తర్వాత) 1977 వరకు ఇందిరాగాంధీ ఒక నియంతలా పాలించింది.

తన ఆధిపత్యానికి అడ్డం అనిపించిన ప్రతిసారి రాజ్యాంగాన్ని సవరించింది, ఆఖరికి 1973లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని నియమించినప్పుడు, నిబంధనలకు భిన్నంగా అందరికన్నా సీనియర్ జడ్జిని కాదని, సీనియారిటీలో నాలుగో స్థానంలో ఉన్న లిరేలిని ప్రధాన న్యాయమూర్తిని చేసింది. 1971-77 మధ్యకాలం ఒకరకంగా పార్లమెంట్‌కి సుప్రీం కోర్ట్‌కి యుద్ధ కాలం లాంటిది. సుప్రీంకోర్టు నిర్ణయాలను మార్చడానికి ఎన్నోసార్లు ఇందిరాగాంధీ పార్లమెంటులో తన బలాన్ని ఉపయోగించి, ఇష్టం వచ్చినట్టి రాజ్యాంగాన్ని సవరించింది. (1977లో జనతా పార్టీ అధికారంలోకి రాగానే, ఇందిరాగాంధీ చేసిన సవరణలన్నీ సవరించబడ్డాయి)

1984లో ఇందిరా గాంధీ మరణించిన తరువాత మళ్లీ 30 ఏళ్లకు, ఒక నియంత ఈ దేశాన్ని పరిపాలిస్తున్నాడు. తన ఇష్టం వచ్చినట్టు రాజ్యాంగానికి సవరణలు చేస్తున్నాడు. ఈ సవరణల ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూపమే, మారిపోతున్న విషయం కాశ్మీర్లో ముస్లింలు, ఈశాన్య భారతదేశంలో గిరిజనులు, దేశవ్యాప్తంగా దళిత, ఆదివాసి, మానవ హక్కుల కార్యకర్తలు తప్ప,లిదేశభక్తులకులి అర్థం కాకపోవటం, కరోనా కంటే ప్రమాదకరం.

**జోహార్... ఎన్టీ రామారావు**

**- డాక్టర్ కొలికపూడి శ్రీనివాస రావు**

## ఎన్టీఆర్.. మారుమ్రోగిపోవాలి పేరు

### మహానుభావుడికి మహా పురస్కారం భారతరత్న ఇవ్వాలి

ఎన్టీఆర్..
ఆయనకు భారతరత్న రాలేదేమి..?
ఊహు..ఇవ్వలేదేమి..??

ఎవరి కంటే తీసిపోయారు
ఆయన..నటుడిగా పరిపూర్ణుడు..
రాజకీయవేత్తగా సంచలనం..
వ్యక్తిగా మహానుభావుడు..

ఇంతకంటే ఏం అర్హతలు కావాలి..ఎన్నో రంగాలలో ఎందరినో మించి ఎన్నెన్నో సాధించిన ఒక విశిష్ట వ్యక్తి

నందమూరి తారక రామారావు.కొన్ని రంగాల్లో ఆయన రాణించిన తీరు నభూతో నభవిష్యతి..

ఒక్క తెలుగుజాతి మాత్రమే గాక యావత్ భారత సమాజం ఎప్పటికీ మరిచిపోలేని ఒక శిఖర సమానుడు ఆయన..

అలాంటి మహనీయునికి అత్యున్నత పురస్కారం ఇచ్చి గౌరవించడం భరతజాతి ధర్మం..

ఇవ్వకపోవడంలో మరేంటో
మర్మం..!

మరో విషయం..

చలనచిత్ర సీమలో ఎన్టీఆర్ ఒక మేరు నగం..

ఆయన పోషించినన్ని వైవిధ్యభరితమైన పాత్రలు ప్రపంచంలో ఇంకే నటుడూ పోషించలేదంటే అది ఎంత మాత్రం అతిశయోక్తి కాబోదు..ఇక్కడ ఎన్టీఆర్ నట వైశిష్ట్యం.. ఆయన రాజకీయ ప్రస్థానం..వ్యక్తిత్వ ఔన్నత్యం..వీటి గురించి రాస్తే ఒక మహాగ్రంధమే అవుతుంది.నిజానికి అదే భారతరత్నతో సమానమైనది.

ఇప్పుడు అంశం
ఆ మహానటుడికి..
మహోన్నత వ్యక్తికి..
గొప్ప రాజకీయవేత్తకి
భారతరత్న ఎందుకు ఇవ్వలేదని..!?

ఇక్కడే మరో మాట..

అంతటి నందమూరికి పద్మశ్రీ మినహా మరో బిరుదు లేదంటే అదెంత ఘోరమో కదా.. పద్మభూషణ్.. పద్మ విభూషణ్.. ఇవిగాక దాదా సాహెబ్ ఫాల్కే వంటి పురస్కారాలకు ఆ విశిష్ట వ్యక్తి పేరు ఆయన జీవించి ఉన్నప్పుడు గాని..మరణించిన తర్వాత గాని పరిశీలనకు రాలేదంటే వెనక రాజకీయాలే నడిచాయో..ఈర్ష్యా ద్వేషాలే చోటు చేసుకున్నాయో.. ఇంకేమి కారణాలు దాగి ఉన్నాయో..వీలైనంత మేర విశ్లేషిద్దాం.!

### ఎన్టీఆర్..తెలుగు వారి గుండె చప్పుడు..
### తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక

తెలుగుజాతి గొప్పదనాన్ని నటుడిగా..రాజకీయ నాయకుడిగా దేశానికి ప్రపంచానికి చాటి చెప్పిన మహావ్యక్తి.. అంతే కాదు..ఈ రోజున కేంద్రప్రభుత్వాలైనా గాని.. రాష్ట్రాలలో కాని అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలకు ఆయనే బీజాలు వేశారు.రాజకీయాల్లోకి వస్తూనే నందమూరి తారక రామారావు ప్రకటించిన..అధికారంలోకి రాగానే అమలు చేసిన కిలో రెండ్రూపాయల బియ్యం ఈ రోజున ఎన్నో రూపాంతరాలు చెంది కోట్లాది ఇళ్ళల్లో సంతోషం నింపింది.అలాగే బడుగు బలహీన వర్గాలకు సొంతింటి కల నెరవెరడానికి కూడా ఆయనే ప్రధాన కారకుడు.అలాంటి ఓ ఘనచరిత్ర కలిగిన నాయకుడికి ఉన్నత పురస్కారం రాకపోవడం తెలుగు జాతికి అవమానం.ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై కేంద్రంలోని పెద్దలకు గల చిన్న చూపునకు పరాకాష్ట మాత్రమే గాక ఒక రకంగా తెలుగు వారి ఘోర వైఫల్యం అని కూడా చెప్పవచ్చు.

### బాబూ..మారు

ఎన్టీఆర్‌కు భారతరత్న రాకపోవడం పూర్తిగా చంద్రబాబు నాయుడు వైఫల్యం..నిజం..!భుజాలు తడుముకున్నా.. బుకాయింపులకు తెగబడినా ఇది కాదనలేని సత్యం.కాదని అంటే తమ నాయకుడికి భారతరత్న వచ్చేలా చంద్రబాబు చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలు ఏంటో త్రికరణశుద్ధిగా చెప్పమనండి. ఇప్పుడంటే సీన్ మారింది కాని ఒకనాడు కేంద్రంలో చంద్రబాబు ఏం చెబితే అదే జరిగిన కాలం. కలాంను నేనే ప్రెసిడెంట్ చేశా..వాజపేయి ప్రధాని కావడానికి నేనే మూలకారణం..ఇలా పదేపదే డంబాలకు పోయే బాబు నిజానికి తన పార్టీ మూలస్తంభం.. తమందరి తలరాతల విధాత..ముఖ్యంగా..పరిస్థితులు..జరిగిన విధానం ఏదైతే గాని తాను ముఖ్యమంత్రి..జాతీయ స్థాయి నాయకుడు కావడానికి కారణమైన వ్యక్తికి భారతరత్న వంటి గొప్ప పురస్కారం వచ్చేలా చేసి ఉంటే ఎంత బాగుణ్ణు. ఆయన అడిగి ఉంటే వాజపేయి..మోడీ కాదనే వారా..కారణాలు ఏవైనా గాని బాబు అందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు.చేసి ఉంటే ఖచ్చితంగా వచ్చేది.రాలేదు గనక చెయ్యలేదని భావించాల్సిందే.

ఈ విషయంలో ఎన్టీఆర్ కుటుంబం కూడా అవసరమైనంత స్థాయిలో స్పందించలేదు.బాబుపై ఒత్తిడి తెచ్చిన దాఖలాలు లేవు.ఇటు తెలుగుదేశం పార్టీ నాయకులు గాని..అటు రామారావు కుటుంబం గాని ఎంతసేపూ చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునేందుకే తాపత్రయ పడ్డారు గాని సొంత లాభం కొంత మానుకుని పెద్దాయన రుణం తీర్చుకునే ఆలోచన లేకపాయె..ఇది



దురదృష్టకరం.నిజానికి వారంతా ఆ పని చేసి ఉంటే ఒకనాడు తమ దేవుడికి చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం చేసుకున్నట్టు అయ్యేది కూడా.. రామారావు ఇంత గొప్పవారు..నాన్న గారు మహానుభావుడు అని మాటలు చెబితే సరిపోతుందా..ఆయన రుణం తీరిపోతుందా.. చెప్పండి..!

### శతజయంతి వేళ శతకోటి ప్రణామాలు!

ఇది ఎన్టీఆర్ శత జయంతి సంవత్సరం..28న ఆయన నూరో సంవత్సరంలో అడుగుపెట్టినట్టు..వచ్చే ఏడాది.. అంటే.. 2023 మే 28 నాటికి ఆ చారిత్రక పురుషుడికి నూరు నిండుతుంది. ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వడానికి ఇంతకు మించి సందర్భం ఏముంటుంది..

అయితే కేంద్రం ఆ పని తనంత తానుగా చేసే పరిస్థితి లేదు. రాష్ట్రం నుంచే ప్రయత్నాలు జరగాలి.. రాష్ట్రంలో ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం నందమూరి తారక రామారావు అనే వ్యక్తిని తన ప్రత్యర్థి పార్టీ వ్యవస్థాపకుడుగా గాక తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా గౌరవించి కృషి చెయ్యవచ్చు.గతంలో ఎవరూ చెయ్యని విధంగా ఎన్టీఆర్ పేరు జిల్లాకి పెట్టింది ఈ ప్రభుత్వమే.అదే స్ఫూర్తితో తెలుగుబిడ్డ రామారావుకి భారతరత్న రావడానికి కూడా ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చెయ్యాలి.ఇక ప్రధాన బాధ్యత తెలుగు ప్రజలదే..

ఎన్టీఆర్ ఉభయ రాష్ట్రాల ఉమ్మడి ఆస్తి ..ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారి సొత్తు.. తెలుగు జాతి విశిష్ట ప్రతినిధి.. అలాంటి వ్యక్తికి భారతరత్న పురస్కారం ఇవ్వాలనే డిమాండుతో ఒక మహోద్యమమే సాగాలి.

సమాచార వ్యవస్థ ఇంత విస్తృతంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలుగు వారి కోరికని సంబంధిత పెద్దల దృష్టికి తీసుకు వెళ్ళడం సులువైన పనే..తెలుగువారందరూ మూకుమ్మడిగా అందుబాటులో ఉండే ప్రతి వేదికపై నుంచీ స్పందించాలి.

స్టేటస్..వాట్సాప్..ట్విట్టర్.. ఫేస్ బుక్.. పత్రికలు.. టివిలు.. వినతిపత్రాలు.. ఇలా అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో తమ కోరికని ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలి. ఇక ముఖ్యంగా తెలుగు సినిమా పెద్దలు తమ ఇంటి పెద్దలు భారతరత్న వచ్చేలా ప్రత్యేకంగా నడుం బిగించాలి.మన ఆలో చన ప్రధాని.. సంబంధిత కేంద్ర మంత్రుల దృష్టికి వెళ్ళాలి.

ఈ విషయంలో ముఖ్యంగా మన తెలుగు బిడ్డ..ఎన్టీఆర్ కుటుంబానికి సన్నిహితుడు..

ప్రస్తుత ఉప రాష్ట్రపతి..రానున్న రోజుల్లో దేశ అత్యున్నత పదవిని చేపట్టే వ్యక్తిగా ప్రచారంలో ఉన్న ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

కలిసి నినదిద్దాం..
కలగలిపి సాధిద్దాం..
మన ఎన్టీఆర్..
మన ఆత్మగౌరవం..
మన ఆస్తి..
భారతరత్న కావాలి..
అదే లక్ష్యం..
అదే సంకల్పం..
అదే ధ్యేయం..

-ఎలిశెట్టి సురేష్ కుమార్
జర్నలిస్ట్
9948546286
విజయనగరం

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 29, మే 2024

# ఎన్టీఆర్... పేరు చాలా కాలం యాదుంటది!

**ఎన్టీఆర్ చనిపోయిన 27 సంవత్సరాల తర్వాత కూడా ఆయన గురించి మాట్లాడుకునేటప్పుడు, చాలామంది ఆయన సినిమా నటుడని, శ్రీకృష్ణుడని, శ్రీరాముడని చెబుతూ ఉంటారు. సినిమా నటుడు కాబట్టి ఎన్టీఆర్ గురించి ఇప్పటికీ ప్రజలు చెప్పుకుంటే.. మరి అక్కినేని నాగేశ్వరరావు గురించి అదే ప్రజలు ఎందుకు మర్చిపోయారు?**

20వ శతాబ్దపు తెలుగు వాళ్ల చరిత్ర లో ఎన్టీ రామారావు ని చిరస్మరణీయుడిగా మార్చడంలో, ఆయన సినిమా ఇమేజ్ పాత్ర చాలా తక్కువ. 38 ఏళ్ళ క్రితం, 60 ఏళ్ల వయసులో ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థాన ప్రారంభం ఒక సంచలనం.

1953లో ఆంధ్ర రాష్ట్రం, 1956లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత అంటే 1953 నుంచి 1983 వరకు ఒకే పార్టీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని /రాజ్యాన్ని పాలిస్తున్న నేపద్యంలో, దామోదరం సంజీవయ్య, పీవీ నరసింహారావు, జలగం వెంకటరావు లాంటి నాయకులు తప్ప ఒకే సామాజిక వర్గం ఆధిపత్యం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎదురు లేకుండా సాగుతున్న రోజుల్లో, తెలుగుదేశం స్థాపన ఒక సామాజిక విస్ఫోటనం, ఒక రాజకీయ భూకంపం, ఒక పాలన సంస్కరణ.

అత్యంత సాధారణ కమ్మ కుటుంబంలో పుట్టి, బీఏ వరకు చదువుకొని, మొన్న ఎన్నికల్లో లోకేష్ రాజకీయ ప్రయోగం చేసిన మంగళగిరిలో ఉద్యోగం చేసి, సినిమా రంగంలో వచ్చిన అవకాశాలతో కష్టపడి స్వయంకృషితో ఎదిగిన ఎన్టీఆర్, తన ఆస్తి మొత్తం కొడుకులకు కూతుళ్ళకు పంచి, తనకు అపారమైన కీర్తి సంపదల నిచ్చిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాజకీయాల్లోకి వచ్చాడు.

అప్పటికే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో బ్రాహ్మణుల ఆధిపత్యం అంతరించి, రెడ్ల ఆధిపత్యం స్థిరపడిపోయింది. ఈ రెడ్ల ఆధిపత్యాన్ని నియంత్రించే ప్రయత్నాలలో భాగంగా వెలమ నాయకుడైన జలగం వెంగళరావు కమ్మ నాయకులను, వ్యాపారులను ప్రోత్సహించి నప్పటికీ, కాంగ్రెస్‌లో కమ్మ నాయకులు ముఖ్యమంత్రి స్థాయికి ఎదగలేకపోయారు.

ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకుగా చేసుకొని రెడ్ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌ని పాలిస్తున్న సామాజిక నేపథ్యంలో తెలుగుదేశం పుట్టింది. జగన్మోహన్ రెడ్డికి ప్రశాంత్ కిషోర్ సహాయ పడినట్టు, ఆరోజు పర్వతనేని ఉపేంద్ర లాంటి ఎంతోమంది విద్యావంతులు, నాయకులు కాంగ్రెస్ పార్టీని ఓడించటానికి కావాల్సిన సోషల్ ఇంజనీరింగ్ మౌలిక సూత్రాలను ఎన్టీఆర్‌కి వివరించారు.

అప్పుడు మొదలైంది తెలుగు రాజకీయాల్లో ఒక సామాజిక విప్లవం. ఫలితంగా అప్పటివరకు రాజకీయాల్లో అవకాశాలు రాక వెనుకబడిపోయిన రాయలసీమలో బలిజలు, బోయలు, మాదిగలు. ఉత్తరాంధ్రలో కొప్పుల వెలమలు, కాళింగులు తూర్పుకాపులు, తెలంగాణలో మున్నూరు కాపులు, మాదిగలు, బైండ్ల, గోండి, గౌడ లు, బ్రాహ్మణులు, ముదిరాజులు, కోస్తా జిల్లాల్లో కాపులు, రాష్ట్రంలోని 23 జిల్లాల్లో యాదవులు, ముస్లిం మైనారిటీ లు, మహిళలు పెద్ద ఎత్తున రాజకీయ అవకాశాలు పొంది చట్టసభల్లో ప్రవేశించారు.

## ఎన్టీఆర్...

## పేరు చాలా కాలం యాదుంటది!

ఎలాంటి ఆయుధాలు లేకుండా, ఎలాంటి రక్తపాతం లేకుండా భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు ద్వారా ఈ నిశ్శబ్ద,సామాజిక విప్లవం సాధ్యమైంది.

ఈ సామాజిక విప్లవం తెలంగాణలో ప్రకంపనలు సృష్టించింది. 1948లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై, భారత రాజ్యాంగం ప్రకారం పాలన జరుగుతున్నప్పటికీ తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ, భూస్వామ్య భావజాలం పటిష్టంగా ఉండటం వలన, గ్రామీణ పెత్తందారులు అయిన పటేల్, పట్వారీ వ్యవస్థ లు ప్రజలను అణచివేస్తూ, దోచుకుంటూ బాంచన్ దొరా నీ కాల్ మొక్కుతా సంస్కృతిని కొనసాగిస్తున్న తెలంగాణ సమాజానికి తెలుగుదేశం పార్టీ స్థాపన, ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కావటం, పటేల్ పట్వారీ, వ్యవస్థలు రద్దు కావటం నక్సలైట్ విద్యార్థి సంఘం లో పనిచేసే ఇంద్రా రెడ్డిలాంటి అగ్రకుల అభ్యుదయవాదులు, మోత్కుపల్లి నర్సింహులు నాటి చైతన్యవంతులైన దళిత యువకులు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్ నుండి డైరెక్ట్‌గా ఎమ్మెల్యేలు, మంత్రులు కావటం, ఊహకు కూడా అందని సామాజిక సంచలనం.

పైన చెప్పిన కులాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆయన వాళ్ళల్లో 90% పేద కుటుంబాల నుంచి వచ్చిన వారే. మరో విధంగా చెప్పాలంటే తెలుగుదేశాన్ని స్థాపించడం ద్వారా ఎన్టీఆర్ తెలుగు సమాజానికి అన్ని కులాల నుంచి విద్యావంతులైన, చైతన్యవంతులైన నూతన నాయకులను అందించాడు. (వాళ్ళలో కొంతమంది దళిత, బీసీ నాయకులు వందల కోట్లకు అధిపతులై, సొంత వారినే అణిచివేయడం ఒక విషాద వాస్తవం)

తెలుగుదేశం పార్టీ స్థాపించడం ద్వారా ఎన్టీఆర్ తెచ్చిన సామాజిక విప్లవంలో.. అత్యంత కీలకమైనది రాజకీయాలలో, పరిపాలనలో, చదువులో, ఆఖరికి ఆస్తిలో కూడా స్త్రీలకు ఎక్కువ అవకాశాలు కల్పించడం. ఫలితంగా అన్ని కులాలలో చదువుకున్న మహిళలు నాయకత్వ అవకాశాలు పొందారు.

రెండేళ్ల క్రితం తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో పేలిన ఒక జోక్‌ఏంటంటే.. కెసిఆర్, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి మొదలైన వారిని చూసిన తర్వాత ఇది టీఆర్ఎస్ క్యాబినెట్ సమావేశమా? టిడిపి క్యాబినెట్ సమావేశమా? అని ఒక మంత్రి వ్యాఖ్యానించడం.

ఆఖరికి ఆంధ్రప్రదేశ్లో శాసన మండలి ఎన్నికలలో జగన్ ఎన్నిక చేసిన కడప జిల్లాకు చెందిన సి రామచంద్రయ్య గారిని చూసినప్పుడు నాకు కూడా ఎన్టీఆర్ సృష్టించిన నాయకులు గుర్తొచ్చారు. ఎన్టీఆర్ తీసుకొచ్చిన సామాజిక మార్పుల తర్వాత



మరో కీలకమైన అంశం కేంద్ర రాష్ట్ర సంబంధాల పై ఎన్టీఆర్ ప్రభావం.

1952, 57, 62.. మూడు సాధారణ ఎన్నికలలో , కేంద్రంలో మరియు రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది (1957లో కేరళ తప్ప). కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులను, హై కమాండ్ నిర్ణయిస్తుంది కాబట్టి, రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని, ప్రణాళిక సంఘం లో కేంద్రం పెత్తనాన్ని, జాతీయ అభివృద్ధి మండలి లో ముఖ్యమంత్రులు ప్రశ్నించే వాళ్ళు కాదు.

కానీ 1967 సాధారణ ఎన్నికలలో దేశంలోని పద్నాలుగు రాష్ట్రాలలో, తొమ్మిది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి, కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ కాంగ్రెస్సేతర ప్రభుత్వాలలో.. తమిళనాడు ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, పంజాబ్ ప్రభుత్వం కేంద్రం పెత్తనాన్ని నిరసిస్తూ, కేంద్ర- రాష్ట్ర సంబంధాలపై ఒక కమిషన్ ని నియమించాలని, కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. కానీ రాజ్యాంగాన్ని కూడా దిక్కరించి నియంతలా పరిపాలించిన ఇందిరాగాంధీ పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలో 1983లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, దేశంలోని కాంగ్రెసేతర పార్టీల ముఖ్యమంత్రులను, ప్రధాన నాయకులను విజయవాడ ఆహ్వానించి బ్రహ్మాండమైన బహిరంగ సభ నిర్వహించి కేంద్రం మిథ్య (ఉంది అనుకుంటే ఉంది, లేదు అనుకుంటే లేదు) అని ప్రకటించి, ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలన్నింటికీ కొత్త నాయకుడిగా అవతరించాడు.

1966లో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్, 1969లో తమిళనాడు ప్రభుత్వం నియమించిన రాజమన్నార్ కమిటీ, 1973లో పంజాబ్ లో చేసిన ఆనందపూర్ సాహిబ్ తీర్మానం, 1977లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సమర్పించిన మెమోరాండంలో ఇలా ఎన్నోసార్లు, ఎన్నో కమిటీలు కేంద్ర రాష్ట్ర సంబంధాలను మళ్లీ అధ్యయనం చేయాలి, రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం ఆపేయాలి, భారత రాజ్యాంగం ఏర్పాటుచేసిన సమాఖ్య వ్యవస్థను అమలు చేయాలి, అకారణంగా రాష్ట్రాలలో ప్రభుత్వాన్ని రద్దు చేసి, రాష్ట్రపతి పాలన పెట్టకూడదు, రాష్ట్రాల పాలనా వ్యవహారాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుల జోక్యం ఉండకూడదని ఎన్నిసార్లు చెప్పినా స్పందించని ఇందిరాగాంధీ ఎన్టీఆర్ ప్రభంజనానికి భయపడి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన కొద్ది నెలల్లోనే కేంద్ర రాష్ట్ర సంబంధాల అధ్యయనం కోసం 1983లో సర్కారియా కమిషన్‌ని నియమించింది.

రాజకీయాలలో ఎవరికీ భయపడని ఇందిరాగాంధీ, ఎన్టీఆర్‌కి భయపడింది అని ఈ ఒక్క నిర్ణయంతో, జాతీయ స్థాయి కాంగ్రెసేతర నాయకులకు స్పష్టంగా అర్థమైంది. అందుకే ఒక్కసారి కూడా పార్లమెంట్ కి పోటీ చేయని ఎన్టీఆర్ ను నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.(1984లో లోక్ సభలో,అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం, 1989లో ఆంధ్రప్రదేశ్లో గెలుచిఉంటే, ఎన్టీఆర్, వి.పి.సింగ్ స్థానంలో ప్రధాన అయ్యేవాడు).

1988లో సర్కారియా కమిషన్ నివేదిక సమర్పించిన నాటి నుండి 2007లో కేంద్ర రాష్ట్ర సంబంధాల పై పూంఛీ కమిషన్ ను నయమించేంత వరకు, అనేక రాష్ట్రాల్లో అకారణంగా రాష్ట్రపతి పాలన రాకుండా కాపాడింది, సర్కారియా కమిషన్ సిఫారసులే. అది జాతీయ రాజకీయాలపై ఎన్టీఆర్ వేసిన చెరగని ముద్ర.

1971లో మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత (1966 మొదటిసారి, లాల్ బహుదూర్ శాస్త్రి మరణం తర్వాత, 1967 రెండవ సారి, సాధారణ ఎన్నికల తర్వాత) 1977 వరకు ఇందిరాగాంధీ ఒక నియంతలా పాలించింది. తన ఆధిపత్యానికి అడ్డం అనిపించిన ప్రతిసారి రాజ్యాంగాన్ని సవరించింది, ఆఖరికి 1973 లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని నియమించినప్పుడు, నిబంధనలకు భిన్నంగా అందరికన్నా సీనియర్ జడ్జిని కాదని, సీనియారిటీలో నాలుగో స్థానంలో ఉన్న రే ని ప్రధాన న్యాయమూర్తిని చేసింది.

1971-77 మధ్యకాలం ఒకరకంగా పార్లమెంట్ కి సుప్రీం కోర్ట్‌కి యుద్ధ కాలం లాంటిది. సుప్రీంకోర్టు నిర్ణయాలను మార్చడానికి ఎన్నోసార్లు ఇందిరాగాంధీ పార్లమెంటులో తన బలాన్ని ఉపయోగించి, ఇష్టం వచ్చినట్టు రాజ్యాంగాన్ని సవరించింది. (1977 లో జనతా పార్టీ అధికారంలోకి రాగానే, ఇందిరాగాంధీ చేసిన సవరణలన్నీ సవరించబడ్డాయి)

1984లో ఇందిరా గాంధీ మరణించిన తరువాత మళ్లీ 30 ఏళ్లకు, ఒక నియంత ఈ దేశాన్ని పరిపాలిస్తున్నాడు. తన ఇష్టం వచ్చినట్టు రాజ్యాంగానికి సవరణలు చేస్తున్నాడు. ఈ సవరణల ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూపమే, మారిపోతున్న విషయం కాశ్మీర్లో ముస్లింలు, ఈశాన్య భారతదేశంలో గిరిజనులు, దేశవ్యాప్తంగా దళిత, ఆదివాసి, మానవ హక్కుల కార్యకర్తలు తప్ప,దేశభక్తులకు అర్థం కాకపోవటం, కరోనా కంటే ప్రమాదకరం. జోహార్ ఎన్టీఆర్

**- డాక్టర్ కొలికపూడి శ్రీనివాస రావు**

# ‘అన్న’కు భారతరత్న ఇంకెప్పుడు?

తెలుగుదేశం పార్టీని ప్రకటించిన సందర్భంలో నందమూరి తారకరామారావు “ఈ పార్టీ పేదవాడి ఆకలి మంటల్లోంచి పుట్టింది” అని చెప్పినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే, అప్పటి వరకూ ఏ రాజకీయ నాయకుడు ఉపయోగించని పదజాలం అది. ఆ సమయంలోనే ఓ విలేకరి “మీ సిద్ధాంతం ఏమిటి రామారావు గారు?” అని ప్రశ్నించినపుడు ఎన్టీఆర్ నోటి వెంట నమాధానం బుల్లెట్లా వెలువడింది. “గ్రంధాలయాల్లో దుమ్ముపేరుకుపోయిన పుస్తకాల్లో మీకు మా సిద్ధాంతం కన్పించదు. మీ వీధిలో ఉన్న పేదవాడి ఆకలి చూపులలో మాత్రమే అది మీకు దర్శనమిస్తుంది” అంటూ ఒకింత ఆవేశంతో చెప్పారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో “పేదవాడికి పట్టెడన్నం పెట్టడం, నిలువనీడ కల్పించడం, ఒంటినిండా బట్ట కప్పుకొని ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడం” తాలి ప్రాధాన్యతాంశంగా పేర్కొన్నారు. 1983లో అధికారంలోకి రాగానే కిలో రూ. 2లకు 25 కిలోల బియ్యం పథకం, పక్కా గృహ నిర్మాణం, సగం ధరకే జనతా వస్త్రాలు వంటి పథకాలు అమలు చేశారు.

సబ్సిడీ బియ్యం పథకం ప్రభుత్వ ఖజానాకు భారం అవుతుందని కొందరు అధికారులు చెప్పినపుడు “పేదవాడికి ఇంతనైవేద్యం పెట్టలేని ప్రభుత్వం దేనికండి?” అంటూ ఎన్టీఆర్ వారిమీద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీని స్పష్టమైన సిద్ధాంతాలతో, విధానాలతో, ఉన్నత రాజకీయ విలువలతో నడిపిన ఎన్టీఆర్ ఎన్నడూ వాటినుండి దూరంగా జరగలేదు, ఎప్పుడూ రాజీపడలేదు. పరిపాలనలో సామాజిక న్యాయం, సంస్కరణలకు పెద్దపీట వేసి సంక్షేమాన్ని, అభివృద్ధిని సమతుల్యం చేశారు. దుబారాను, అవినీతిని అరికట్టారు. సామాన్యులు, రైతులు, మహిళలు బగుడుబలహీన వర్గాల సాధికారత కోసం ఎన్టీఆర్ చేసిన కృషి, కల్పించిన రాజకీయ భాగస్వామ్యం, ప్రవేశపెట్టిన పథకాలు ఆనాడు దేశానికే దిక్సూచీగా నిలిచాయి.

కారణాలు ఏవైనా ఆనాడు దేశంలోని ప్రాంతీయ పార్టీలంటేనే సంకుచిత భావాలు కలిగి ప్రాంతీయతత్వాన్ని రేపుతాయనే అపప్రధ బలంగా నాటుకొని ఉంది. ‘తెలుగుదేశం’ను సైతం అదే గాటన కట్టాలని చూశారు కొందరు. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా దేశ రాజధాని ఢిల్లీ వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన ‘మీట్ ది ప్రెస్’లో పాల్గొన్నప్పుడు ఎన్టీఆర్ను ఓ విలేకరి “మీరు ప్రాంతీయవాది కదా? కేంద్రంతో కలిసి పనిచేయడం ఇబ్బంది కాదా?” అని అడిగాడు. దానికి ఎన్టీఆర్ సమాధానంగా “నేను మొదట భారతీయుణ్ణి. ఆ తర్వాతే తెలుగువాణ్ణి. అయినా రాష్ట్రాలు బలంగా ఉండాలని కోరుకోవడం ప్రాంతీయవాదం కాదు.

రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం బలంగా ఉండగలుగుతుంది” అని పేర్కొన్నారు. కాంగ్రెస్సు మాత్రమే జాతీయ పార్టీ అనడం సరయినది కాదని, కొన్ని ప్రాంతాలకే పరిమితమైన పార్టీల జాతీయ భావనను ప్రశ్నించడం సమంజసం కాదని ఆయన పలు సందర్భాలలో చెప్పేవారు. ఎన్టీఆర్ సినీరంగంలో అగ్రనటుడిగా ఉన్నప్పుడు తెలుగునాట కరవు కాటకాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడుబీ అదేవిధంగా భారత్-పాక్ మధ్య యుద్ధం జరిగినపుడు ఎన్టీఆర్ చొరవ తీసుకొని తన సొంత నిధులతోపాటు, తోటి కళాకారులతో కలిసి విరాళాలు సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధికి, ప్రధానమంత్రి సహాయనిధికి అందించారన్న వాస్తవం తెలుసుకొన్న జాతీయ మీడియా ఎన్టీఆర్ పట్ల ఏర్పరచుకొన్న తమ దురభిప్రాయాన్ని మార్చుకొంది.

ఎన్టీఆర్ అనగానే తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అందరూ అంటారు. నిజానికి ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవమే కాదు.. దేశంలోని రాష్ట్రాల ఆత్మగౌరవాన్ని సైతం నిలబెట్టారంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రాల యూనియన్ అయిన భారతదేశంలో సమాఖ్య విధానం సంపూర్ణంగా అమలై వికేంద్రీకరణ జరగడం కోసం ఎన్టీఆర్ చేసిన కృషి అసామాన్యం, అద్వితీయం. పేరుకే ఫెడరలిజం కాకుండా రాష్ట్రాలు ఆత్మగౌరవంతో మనుగడ సాగించేలా కేంద్రం సహకరించాలని, అందుకొరకు రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చితీరాల్సిందేనని నాటి కేంద్ర ప్రభుత్వంపై ఎన్టీఆర్ ఒత్తిడి పెంచారు. రాష్ట్రాల హక్కుల సాధన కోసం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఒక వేదికపైకి తెచ్చి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కేంద్రీకృత విధానాలను ఎండగట్టారు.

ఎన్టీఆర్ చొరవతో కేంద్ర-రాష్ట్ర సంబంధాల మీద ఏర్పాటయిన ‘సర్కారియా కమిషన్’కు అనేక విజ్ఞప్తులు పంపి రాష్ట్రాలకు మరిన్ని నిధులు, అధికారాలు అందించేందుకు అవసరమైన సూచనలు చేయాలని కోరారు. ప్రాంతీయ ప్రయోజనాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే లోక్సభలో ప్రాంతీయ పార్టీలు ఎక్కువ ప్రాతినిధ్యం పొందడానికి కృషి చేయాలని అందుకు కాంగ్రేసేతర పక్షాల మధ్య ఐక్యత సాధించాలని చెప్పేవారు. జాతీయ స్థాయిలో కాంగ్రేసేతర పార్టీలన్నింటిని ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ముందుగా ఆ ప్రయోగాన్ని ఆంధ్రప్రదేశ్లోనే ఆచరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 1984లో జరిగిన లోక్సభ ఎన్నికలలో సిపిఐ, సిపిఎంలను ఒకప్రక్క, మరోపక్క బీజేపీ, జనతా పార్టీలతో పొత్తు కుదుర్చుకొని రాష్ట్రంలోని 42 లోక్సభ స్థానాల్లో 35 స్థానాలను గెలుచుకొని లోక్సభలో అతిపెద్ద పార్టీగా తెలుగుదేశంను నిలిపి దేశం యావత్తూ దృష్టిని తన వైపు తిప్పుకోగలిగారు.

1984 ఆగస్టో గవర్నర్ రామ్లాల్, నాదెండ్ల భాస్కరరావు, కేంద్రంలోని ఇందిరా గాంధీ ప్రభుత్వం కుమ్మక్కై తనను పదవీచ్యుతుడిని చేశాక.. నెల రోజులపాటు ఎన్టీఆర్ చేసిన ప్రజాస్వామ్య పోరాటం స్వాంతంత్ర్యానంతర దేశ రాజకీయ చరిత్రలో ఓ ఉజ్వల ఘట్టంగా మిగిలిపోతుంది. తిరిగి అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలపైన తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. రాష్ట్రపతి పాలన విధించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను తొలగించాలని డిమాండ్ చేయడంతోపాటు



రాష్ట్ర చట్టాలను కేంద్రం వీటో చేసేందుకు అధికారం కల్పించే ఆర్టికల్ 200, 201లను సవరించాలని ఎన్టీఆర్ చేసిన ప్రతిపాదన ఆనాడు దేశంలో ఓ సంచలనం. అలాగే, డా? బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి అమలు జరగాలంటే.. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, ప్రజారోగ్యం, సాంఘిక సంక్షేమం వంటి కార్యక్రమాలను రాష్ట్రాలే నిర్వహించుకొనే అవకాశం కల్పించాలని, బాధ్యతలకు తగినట్టుగా నిధుల సేకరణకు, పన్ను అధికారాలను హేతుబద్ధంగా కేంద్రం-రాష్ట్రాల మధ్య విభజించాలని కోరారు.

కేంద్ర జాబితాలో ఉన్న ఎక్సయిజ్, ఇన్కంటాక్స్, కస్టమ్స్ డ్యూటీ మొదలయిన ఆదాయాల్లో రాష్ట్రాలకు సముచిత వాటాలు ఇవ్వాలంటూ ఎన్టీఆర్ చేసిన ప్రతిపాదనలు జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీశాయి. దాని ఫలితంగానే ఆనాడు 9, 10వ ఫైనాన్స్ కమిషన్లు రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రాలకు పన్నుల్లో ఎక్కువ వాటా ఇవ్వాలని సిఫార్సు చేశాయి. అంతేకాదు.. మార్కెట్ రుణాల్లో రాష్ట్రాల వాటా పెంచాలని, రాష్ట్ర స్థాయి ప్రభుత్వరంగ సంస్థలు కూడా బాండ్ల ద్వారా వనరులు సేకరించేందుకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ఎన్టీఆర్ కేంద్రంపై ఒత్తిడి చేశారు. చట్టబద్ధ వనరుల వాటాలో కేంద్రం అనుసరించే ద్వంద్వ వైఖరిని ఉపేక్షించబోము.. అంటూ రాష్ట్రాల తరపున ఎన్టీఆర్ చేసిన హెచ్చరిక నాడు దేశంలోని కాంగ్రేసేతర ప్రభుత్వాలను సైతం కళ్లు తెరిపించినట్లయింది.

అప్పటివరకు కేంద్రం ఎంతిస్తే అంత తీసుకొనే విధానమే అమలయ్యేది. దానిని ఎన్టీఆర్ వ్యతిరేకించిన తర్వాత.. కేంద్రం - రాష్ట్రాల మధ్య సంబంధాలలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. మరో విధంగా చెప్పాలంటే కేంద్రాన్ని యాచించే స్థాయి నుంచి ఆత్మగౌరవంతో తమ హక్కుల సాధన కోసం రాష్ట్రాలు పోరాడే స్థాయికి చేరుకొన్నాయి. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఎన్టీఆర్ జాతీయ రాజకీయాలను మలుపు తిప్పారు. ప్రాంతీయ పార్టీ అధినేత అయినప్పటికీ.. జాతీయ స్థాయిలో ఎనలేని గౌరవాభిమానాలను పొందారు. చరిత్రను తిరగరాసిన ఇటువంటి విప్లవాత్మక సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

42 సంవత్సరాల తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్టీఆర్ ఓ ఉజ్వల అధ్యాయం. అయితే, ఓ సందర్భంలో ఎన్టీఆర్ “నాతో పుట్టిన పార్టీ నాతోనే పోతుందేమో” అని నిర్వేదంగా అన్నారు. నిజానికి 1995 ఆగస్టో నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ నుంచి తెలుగుదేశం పార్టీ పగ్గాలను తీసుకోకపోయి ఉంటే ఆ తర్వాత ఏం జరిగేదో కానీ, సకాలంలో సరియైన నిర్ణయం తీసుకొని తెలుగుదేశం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి తన విలక్షణ నాయకత్వంతో, పరిపాలనా సామర్థ్యంతో ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన విజయం సాధించారనడానికి అనేక ఉదాహరణలు కళ్లముందు కనిపిస్తాయి. తన రాజకీయ ప్రత్యర్థులు సృష్టించిన ఎన్నో అవరోధాలను, ఇబ్బందులను దాటుకొంటూ ఓ బలీయమైన రాజకీయ శక్తిగా తెలుగుదేశం పార్టీని మలిచి ప్రజల ఆదారాభిమానాలను చూరగొని 9 సంవత్సరాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కుబీ 5 సంవత్సరాలు విభజిత ఆంధ్రప్రదేశ్కు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో రానున్న ఎన్నికలలో విజయం సాధించే దిశగా కృషి చేయడం కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలోనే, క్రిందటేడాది ‘శత జయంతి’ సంవత్సరాన్ని జరుపుకొన్న ఎన్టీఆర్కు కేంద్ర ప్రభుత్వం ‘భారతరత్న’ ప్రకటిస్తుందని చాలామంది భావించారు. రాష్ట్రానికి, దేశానికి ఎన్టీఆర్ చేసిన సేవల్ని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు, అనితర సాధ్యమైన ఆయన నట జీవితాన్ని లెక్కలోకి తీసుకొన్నప్పుడు ఆయనకు ‘భారతరత్న’ లభించాలని కోరుకోవడం అత్యాశ కాబోదు. ఎన్టీఆర్కు ‘భారతరత్న’ ఇంకెప్పుడు అనే ప్రశ్న ప్రతి తెలుగువాడి మదిలో మెదులుతూనే ఉంది. అన్నట్టు.. దేశ రాజకీయాల్లోనే చిన్న అవినీతి మరక కూడా అంటని ఏకైక రాజకీయ నాయకుడు ఒక్క ఎన్టీఆరే!

**- విక్రమ్ పూల**

**సీనియర్ జర్నలిస్ట్**

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024

# తారక రాముడు.. కారణజన్ముడు

## స్వర్గీయ నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర

**తండ్రి** – లక్ష్మయ్య చౌదరి
**తల్లి** – వెంకట్రావమ్మ గారి కుమారుడు ఎన్టీఆర్ జననం మే 28, 1923 నిమ్మకూరు, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
**మరణం:** జనవరి 18, 1996
**ఇతర పేర్లు:** విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్.టి.ఆర్
**అన్నగారు వృత్తి:** సినిమా నటుడు, సినిమా దర్శకుడు నిర్మాత, రాజకీయ నాయకుడు, రంగస్థల నటుడు
ఎత్తు 5.8, బరువు 78
**రాజకీయ పార్టీ:** తెలుగుదేశం పార్టీ
**మతం:** హిందూ
భార్య బసవతారకం
(పెళ్లి 1942– 1985 మరణం)
**పిల్లలు:**
కుమారులు: జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ, మోహనకృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ
**కుమార్తెలు:**
గారపాటి లోకేశ్వరి, దగ్గుబాటి పురంధేశ్వరి
నారా భువనేశ్వరి, కంటమనేని ఉమామహేశ్వరి

నందమూరి తారక రామారావు
1923, మే 28 వ తేదీన, సాయంత్రం 4:32కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా, పామర్రు మండలంలోని, నిమ్మకూరు గ్రామంలో లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ దంపతులకు జన్మించాడు.

మొదట కృష్ణ అని పేరుపెట్టాలని తల్లి అనుకున్నప్పటికీ, మేనమామ తారక రాముడయితే బాగుంటుంది అని చెప్పడంతో ఆ పేరే పెట్టారు.

తరువాత అది కాస్తా తారక రామారావుగా మారింది.

పాఠశాల విద్య విజయవాడ మునిసిపలు హైస్కూలులో చదివాడు. తరువాత విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో చేరాడు. ఇక్కడ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు విభాగానికి అధిపతి. ఒకసారి రామారావును ఒక నాటకములో ఆడవేషం వేయమన్నాడు. అయితే రామారావు తన మీసాలు తీయటానికి 'ససేమిరా' అన్నాడు. మీసాలతోటే నటించడం వలన ఆయనకు "మీసాల నాగమ్మ" అనే పేరు తగిలించారు.

1942 మే 23వ తేదీ సాయంత్రం 3.23నిమిషాలకు అనగా 20 ఏళ్ళ వయసులో మేనమామ కుమార్తె అయిన "" బసవ రామతారకంను పెళ్ళి""" చేసుకున్నాడు.

వివాహో విద్యానాశాయ అన్నట్లు పెళ్ళయిన తరువాత పరీక్షల్లో రెండుసార్లు తప్పాడు.

తర్వాత గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. అక్కడకూడా నాటక సంఘాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఆ సమయంలోనే నేషనల్ ఆర్ట్ థియేటర్ గ్రూప్ (NAT) అనే నాటక సంస్థను స్థాపించి కొంగర జగ్గయ్య,

ముక్కామల, నాగభూషణం, కె.వి.ఎస్.శర్మ తదితరులతో చేసిన పాపం వంటి ఎన్నో నాటకాలు ఆడాడు. తర్వాతి కాలంలో ఈ సంస్థ కొన్ని చిత్రాలను కూడా నిర్మించింది.

ఎన్టీఆర్ మంచి చిత్రకారుడు కూడా. రాష్ట్రవ్యాప్త చిత్రలేఖన పోటీలలో ఆయనకు బహుమతి కూడా లభించింది. సుభాష్ చంద్రబోసు విజయవాడ వచ్చినప్పుడు ఎన్టీఆర్ బోసు బొమ్మను చిత్రించి ఆయనకు కానుకగా ఇచ్చాడు.

రామారావు గారు కాలేజీలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు

వారి ఆస్తి మొత్తం ఏవో కొన్ని కారణాల వల్ల హరించుకుపోయింది.

అప్పుడు యుక్తవయసులో ఉన్న రామారావు జీవనం కోసం అనేక పనులు చేసాడు.

కొన్ని రోజులు పాల వ్యాపారం,
తరువాత కిరాణా కొట్టు,
ఆపై ఒక ముద్రణాలయాన్ని కూడా నడిపాడు.
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అప్పు చేసేవాడు కాదు.

రామారావు 1947లో పట్టభద్రుడయ్యాడు. తదనంతరం ఆయన మద్రాసు సర్వీసు కమీషను పరీక్ష రాసాడు.

పరీక్ష రాసిన 1100 మంది నుండి ఎంపిక చేసిన ఏడుగురిలో ఒకడుగా నిలిచాడు.

లఅప్పుడు ఆయనకు మంగళగిరిలో సబ్–రిజిస్ట్రారు ఉద్యోగం లభించింది.

అయితే సినిమాలలో చేరాలనే ఆశయం కారణంగా ఆ ఉద్యోగంలో మూడు వారాలకంటే ఎక్కువ ఉండలేకపోయాడు.

ప్రముఖ నిర్మాత బి.ఏ.సుబ్బారావు ఎన్టీఆర్ ఫోటోను ఎల్వీ ప్రసాదు దగ్గర చూసి, వెంటనే ఆయనను మద్రాసు పిలిపించి పల్లెటూరి పిల్ల సినిమాలో కథానాయకుడిగా ఎంపిక చేసాడు.

దీనికిగాను రామారావుకు వెయ్యి నూటపదహార్ల పారితోషికం లభించింది. వెంటనే ఆయన తన సబ్–రిజిస్ట్రారు ఉద్యోగానికి రాజీనామా చేసేసాడు.

కానీ సినిమా నిర్మాణం వెంటనే మొదలవలేదు. ఈలోగా మనదేశం అనే సినిమాలో అవకాశం రావడంతో దానిలో నటించాడు. అంచేత ఆయన మొదటిసారి కెమేరా ముందు నటించిన సినిమా మనదేశం అయింది.

1949లో వచ్చిన ఆ సినిమాలో ఆయన ఒక పోలీసు ఇన్స్పెక్టర్ పాత్ర పోషించాడు. 1950లో పల్లెటూరి పిల్ల విడుదలైంది. అదే సంవత్సరం ఎల్వీ ప్రసాదు షావుకారు కూడా విడుదలైంది.

ఈ రెండు సినిమాల తరువాత ఎన్టీఆర్ తన నివాసం మద్రాసుకు మార్చివేశాడు. థౌజండ్ లైట్స్ ప్రాంతంలో ఒక చిన్న గదిని అద్దెకు తీసుకొని అందులో ఉండేవాడు. ఆయనతో పాటు ఆ గదిలో యోగానంద్ (తరువాతి కాలంలో నిర్మాత అయ్యాడు) కూడా ఉండేవాడు.

1951లో కె.వి.రెడ్డి పాతాళభైరవి, దాని తరువాత అదే సంవత్సరం బి.ఎన్.రెడ్డి మల్లీశ్వరి, 1952లో ఎల్వీ ప్రసాదు పెళ్ళిచేసి చూడు, ఆ తరువాత వచ్చిన కమలాకర కామేశ్వర రావు చిత్రం చంద్రహారం ఆయనకు నటుడిగా గొప్ప కీర్తిని సంపాదించి పెట్టాయి.

ఈ సినిమాలన్నీ విజయావారివే. ప్రతీ సినిమాకు నెలకు 500 రూపాయిలు జీతం మరియు 5000 రూపాయిల పారితోషికమూ ఇచ్చారు.

పాతాళభైరవి 34 కేంద్రాలలో 100 రోజులు ఆడి అప్పట్లో సంచలనం సృష్టించింది. తన ఉంగరాల జుట్టుతో, స్ఫురద్రూపంతో, వెలుగులు విరజిమ్మే నవ్వుతో ఆంధ్రదేశ ప్రజలను ఆకట్టుకుని వారి మనసుల్లో నిలిచిపోయాడు.

1956లో విడుదలైన మాయాబజార్‌లో ఆయన తీసుకున్న 7500 రూపాయల పారితోషికం అపట్లో అత్యధికం అని భావిస్తారు. 1959లోఏ.వి.యం.ప్రొడక్షన్స్ వారు నిర్మించి, విడుదల చేసిన భూకైలాస్ చిత్రంలో రావణబ్రహ్మ పాత్రకు రామారావు ప్రాణప్రతిష్ఠ చేసాడు.

1960లో విడుదలయిన శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం భారీ విజయం సాధించింది. శ్రీమద్విరాటపర్వములో ఆయన ఐదు పాత్రలు పోషించాడు.

ఆ విధంగా 1950లలో ఎన్టీఆర్ ఎంతో ప్రజాదరణ పొందిన నటుడిగా ఎదిగాడు. సంవత్సరానికి 10 సినిమాల చొప్పున నటిస్తూ ఉండేవాడు.

1963లో విడుదలైన లవకుశ అతి పెద్ద విజయాన్ని నమోదు చేసింది. ఎన్టీఆర్ సినిమాల్లోకి వచ్చిన 22 సంవత్సరముల వరకు ఆయన పారితోషికం 4 లేదా 5 అంకెల్లోనే ఉండేది. 1972 నుంచి ఆయన పారితోషికం లక్షల్లోకి చేరింది.

ఎన్టీఆర్ దర్శకత్వంలో వచ్చిన మొదటి చిత్రం 1961లో విడుదలైన సీతారామ కళ్యాణం. ఈ చిత్రాన్ని తన సోదరుడు త్రివిక్రమరావు ఆధీనంలోని "నేషనల్ ఆర్ట్స ప్రొడక్షన్స" పతాకంపై విడుదల చేసాడు.

1977లో విడుదలైన దాన వీర శూర కర్ణలో ఆయన మూడు పాత్రల్లో నటిస్తూ స్వయంగా దర్శకత్వం చేసాడు.

1978లో విడుదలైన శ్రీరామ పట్టాభిషేకం సినిమాకు కూడా ఆయన దర్శకత్వం వహించాడు. ఎన్టీఆర్ నటించిన సాంఘిక చిత్రాలు అడవిరాముడు, యమగోల గొప్ప బాక్సాఫీసు విజయం సాధించాయి.

1991 ఎన్నికల ప్రచారం కోసం ఆయన నటించి, దర్శకత్వం వహించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర 1990లో విడుదలైంది.

ఎన్టీఆర్ క్రమశిక్షణలో చాలా కచ్చితంగా ఉండేవాడు. గంభీరమైన తన స్వరాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ మద్రాసు మెరీనా బీచిలో అభ్యాసం చేసేవాడు. నర్తనశాల సినిమా కోసం ఆయన వెంపటి చినసత్యం దగ్గర కూచిపూడి నేర్చుకున్నాడు. వృత్తిపట్ల ఆయన నిబద్ధత అటువంటిది. కెమెరా ముందు ఎన్టీఆర్ తడబడిన దాఖలాలు లేవని చెబుతూంటారు, ఎందుకంటే ఆయన డైలాగులను ముందుగానే కంఠతా పట్టేసేవాడు.

### రాజకీయ ప్రవేశం

1978లో ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారానికి వచ్చిన కాంగ్రేసు పార్టీ అంతర్గత కుమ్ములాటల వలన అపకీర్తి పాలయ్యింది.

తరచూ ముఖ్యమంత్రులు మారుతూ ఉండేవారు. ఐదు సంవత్సరాల కాలంలో నలుగురు ముఖ్యమంత్రులు మారారు.

ముఖ్యమంత్రిని ఢిల్లీలో నిర్ణయించి, రాష్ట్రంలో శాసన సభ్యుల చేత నామకార్థం ఎన్నిక చేయించేవారు. ఈ పరిస్థితి కారణంగా ప్రభుత్వం అప్రదిష్ట పాలయింది.

కనుక నందమూరిబసవతారకం గారు రామారావు గారితో ఒక్కమాట.. ప్రజలకు న్యాయం చేయాలంటే, మీరు రాజకీయాలలోకి రావాలి కదా.. అన్నారు!

1981లో ఊటీలో సర్దార్ పాపారాయుడు చిత్రం షూటింగు విరామసమయంలో ఒక విలేఖరి, మీకు ఇంకో 6 నెలల్లో 60 సంవత్సరాలు నిండుతున్నాయి కదా, మరి మీ జీవితానికి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకుంటున్నారా.? అని అడిగాడు.

దానికి జవాబుగా నేను నిమ్మకూరు అనే చిన్న గ్రామంలో పుట్టాను. తెలుగు ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు. వారికి నేనెంతో రుణపడి ఉన్నాను. కాబట్టి నా తరువాతి పుట్టిన రోజునుంచి నా వంతుగా ప్రతీనెలలో 15రోజులు తెలుగుప్రజల సేవకోసం కేటాయిస్తాను అని చెప్పాడు.

ఆయన చేయబోయే రాజకీయ ప్రయాణానికి అది మొదటి సంకేతం అని బసవతారకం అన్నారు.

అప్పటి నుండి ఎన్టీఆర్ తాను నటించవలసిన సినిమాలు త్వరత్వరగా పూర్తి చేసాడు. 1982 మార్చి 21 న హైదరాబాదు వచ్చినప్పుడు అభిమానులు ఆయనకు ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలికారు.

1982 మార్చి 29 సాయంత్రము 2:30 లకు కొత్త పార్టీ పెడుతున్నట్లు చెప్పాడు. ఆసమయంలోనే తన పార్టీ పేరు " తెలుగుదేశంగా " నిర్ణయించి, ప్రకటించాడు.

పార్టీ ప్రచారానికై తన పాత చెవ్రోలెటు వ్యానును బాగు చేయించి, దానిని ఒక కదిలే వేదికగా తయారు చేయించాడు. దానిపై నుండే ఆయన తన ప్రసంగాలు చేసేవాడు. దానిని ఆయన "చైతన్యరథం" అని అన్నాడు.

ఆ రథంపై "తెలుగుదేశం పిలుస్తోంది, రా! కదలి రా!!" అనే నినాదం రాయించాడు. ఆ తరువాతి కాలంలో భారత రాజకీయాల్లో పరుగులెత్తిన ఎన్నో రథాలకు ఈ చైతన్యరథమే స్ఫూర్తి.

ఎన్టీఆర్ ప్రజలను చైతన్య పరుస్తూ చైతన్యరథంపై ఆంధ్ర ప్రదేశ్ నలుమూలలకూ ప్రచార యాత్రను సాగించాడు. చైతన్యరథమే ప్రచార వేదికగా, నివాసంగా మారిపోయింది. ఒక శ్రామికుడివలె ఖాకీ దుస్తులు ధరించి, నిరంతరం ప్రయాణిస్తూ, ఉపన్యాసాలిస్తూ ప్రజల హృదయాలను దోచుకున్నాడు. ఆంధ్రుల ఆత్మగౌరవ పరిరక్షణ అనే ఒక ఉద్వేగభరితమైన అంశాన్ని తీసుకుని ప్రజల మనోభావాలను తీవ్రంగా ప్రభావితం చేసాడు. కాంగ్రెసు అధికారాన్ని కూకటివేళ్ళతో పెకలించివేసిన ప్రచార ప్రభంజనమది.

ఎన్టీఆర్ ప్రసంగాలు ఉద్వేగభరితంగా, ఉద్రేకపూరితంగా ఉండి, ప్రజలను ఎంతో ఆకట్టుకునేవి. ముఖ్యమంత్రులను తరచూ మార్చడం.., అదీ ఢిల్లీ పెద్దల నిర్ణయం ప్రకారమే తప్ప, శాసనసభ్యుల మాటకు విలువ లేకపోవడం వంటి వాటిని లక్ష్యంగా చేసుకుని తన ప్రసంగాలను మలచుకున్నాడు. కాంగ్రెసు నాయకులు కుక్కమూతి పిందెలనీ, కొజ్జాలనీ, దగాకోరులనీ, దగుల్బాజీలని, అధిష్టానం చేతిలో కీలుబొమ్మలనీ తీవ్రపదజాలంతో విమర్శించాడు.

కాంగ్రెసు పార్టీ కారణంగా తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతిన్నదనీ, దాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారనీ విమర్శిస్తూ, ఆ ఆత్మగౌరవ పునరుద్ధరణకే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పాడు. కాంగ్రెసు నిర్వాకానికి అప్పటికే విసుగు చెందిన, ప్రజలు ఆయన నినాదం పట్ల ఆకర్షితులయ్యారు.

1983 జనవరి 7 న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. తెలుగుదేశం 199, కాంగ్రెసు 60, సిపిఐ 4, సిపిఎం 5, బిజెపి 3 సీట్లు గెలుచుకున్నాయి. 97 ఎళ్ళ సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెసు పార్టీ 9 నెలల తెలుగుదేశం పార్టీ చేతుల్లో ఓడిపోయింది. ఆయన విజయానికి అప్పటి దినపత్రికలు – ఎంతో తోడ్పడ్డాయి.

1970లలో ఎదుర్కొన్న చిన్నపాటి ఒడిదొడుకులు తప్పించి, ఎన్టీఆర్ సినిమా జీవితం విజయవంతంగా, అప్రతిహతంగా సాగిపోయింది.

అయితే ఆయన రాజకీయ జీవితం అలా –నల్లేరుపై నడ



కలా సాగలేదు. అద్భుతమైన విజయాలకూ, అవమానకర మైన అపజయాలకూ మధ్య తూగుటూయలలా సాగింది.

ఎన్నికల ప్రచారసమయంలో ఎన్టీఆర్ కాంగ్రెసు నాయకులపై చేసిన ఆరోపణల కారణంగానూ, ఎన్నికల్లో తెలుగుదేశం చేతిలో కాంగ్రెసు పొందిన దారుణ పరాభవం వల్లనూ, ఆ రెండు పార్టీల మధ్య వైరి భావం పెరిగింది.

రాజకీయపార్టీల మధ్య ఉండే ప్రత్యర్థి భావన కాక శతృత్వ భావన నెలకొంది.ఇది తెలుగుదేశం పాలిత ఆంధ్రప్రదేశకు కాంగ్రెసు పాలిత కేంద్రానికీ మధ్య వివాదంగా మారే వరకు వెళ్ళింది.

కేంద్రం మిథ్య అనేంతవరకు ఎన్టీఆర్ వెళ్ళాడు.

1983 శాసనసభ ఎన్నికల్లో ఆయన సాధించిన అపూర్వ విజయం ఆయన రాజకీయ జీవితంలో అత్యున్నత ఘట్టం.

అధికారం చేపట్టిన తరువాత, అనేక వివాదాస్పద నిర్ణయాలు కూడా తీసుకున్నాడు. ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ తగ్గింపు వీటిలో ప్రధానమైనది. ఈ నిర్ణయాల కారణంగా చాలా వేగంగా ప్రజాభిమానం కోల్పోసాగాడు.

1984 ఆగష్టు 16 న నాదెండ్ల భాస్కరరావు, అప్పటి గవర్నరు రాంలాల్, ప్రధానమంత్రి ఇందిరా గాంధీల లోపాయికారీ సహకారంతో రామారావును అధికారం నుండి తొలగించి, తాను దొడ్డిదారిన గద్దెనెక్కడంతో తిరిగి రామారావు ప్రజల్లోకి వెళ్ళాడు. జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాడు. ఈ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో మిత్రపక్షాలు ఆయనకు ఎంతో సహాయం చేసాయి. ఫలితంగా సెప్టెంబర్ 16 న రామారావును తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించడం కేంద్ర ప్రభుత్వానికి తప్పింది కాదు. నెలరోజుల్లోనే, ఆయన ప్రభ తిరిగి శిఖరాగ్రానికి చేరిన సందర్భమిది.

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి కాంగ్రేసేతర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడు.

1984లో సినిమారంగంలో "స్లాబ్ విధానము"ను అమలు పరిచాడు. ప్రభుత్వానికి ఖర్చు తప్ప ఎందుకూ పనికిరాదని శాసనమండలిని రద్దు చేసాడు (1985 జూన్ 1న అధికారికంగా మండలి రద్దయింది).

హైదరాబాదులోని హుస్సేన్‌సాగర్ కట్టపై (ట్యాంకుబండ్ నందు) సుప్రసిద్ధులైన తెలుగువారి విగ్రహాలు నెలకొల్పాడు.

నాదెండ్ల కుట్ర కారణంగా శాసనసభలో తనకు తగ్గిన ఆధిక్యతను తిరిగి సంపాదించే ఉద్దేశంతో మార్చి 1985లో ప్రజల తీర్పు కోరుతూ మధ్యంతర ఎన్నికలకు వెళ్ళాడు. ఆ ఎన్నికలలో 202 స్థానాల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వచ్చాడు.

1985–'89 మధ్య కాలంలో తన ఏకస్వామ్యపాలన వలన ఎన్టీఆర్ ఎంతో అప్రదిష్ట పాలయ్యాడు. పార్టీలోను, ప్రభుత్వంలోను అన్నీ తానే అయి నడిపించాడు. ప్రజల్లో నిరసన భావం కలగడానికి ఇది ప్రధాన కారణమైంది. 1989లో ఎన్నికలకు కొద్ది నెలల ముందు మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరచి కొత్త మంత్రుల్ని తీసుకున్నాడు.

ఈ కాలంలో జరిగిన కొన్ని కులఘర్షణలు కూడా ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసాయి. 1989 ఎన్నికల్లో ఇది తీవ్ర ప్రభావం చూపింది. కాంగ్రెసు తెలుగుదేశాన్ని చిత్తుగా ఓడించి తిరిగి అధికారానికి వచ్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా భారత దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నిటినీ, కమ్యూనిస్టులతో కలిపి కాంగ్రేసుకు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ అనే ఒక సంకీర్ణాన్ని ఏర్పాటు చేయటంలో ఎన్టీఆర్ విజయం సాధించాడు.

1991లో నంద్యాలలోక్‌సభ ఉప ఎన్నికలలో కాంగ్రెసు తరపున అభ్యర్థిగా అప్పటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు నిలబడగా, ప్రధానమంత్రి అయిన ఒక తెలుగువాడికి గౌరవ సూచకంగా ఎన్టీఆర్ ఎవరినీ పోటీగా నిలబెట్టలేదు.

1989–94 మధ్యకాలం ఎన్టీఆర్ రాజకీయ చరిత్రలో అత్యంత నిమ్నదశగా చెప్పవచ్చు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభలో అధికార కాంగ్రెసు పార్టీచేతిలో అవమానాలు పొందాడు. శాసనసభలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణ ఏస్థాయిలో ఉండేదంటే – ఈ కాలంలో ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ సభ్యులను 9 సార్లు సభనుండి బహిష్కరించారు.

ఆ కాలంలో నాలుగు సినిమాలలో నటించాడు కూడా. తన జీవితకథ రాస్తున్న లక్ష్మీపార్వతిని 1993 సెప్టెంబరులో పెళ్ళి చేసుకున్నాడు. రామారావు వ్యక్తిగత జీవితంలో ఇదో కీలకమైన మలుపు.

ఆయన వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులతో ఆయన సంబంధాలపై ఈ పెళ్ళి కారణంగా నీడలు కమ్ముకున్నట్లు కనిపించాయి.

1994లో కిలో బియ్యం రెండు రూపాయలు, సంపూర్ణ మద్య నిషేధం, వంటి హామీలతో, మునుపెన్నడూ ఏపార్టీ కూడా సాధించనన్ని స్థానాలు గెలిచి మళ్ళీ అధికారంలోకి వచ్చాడు.

ప్రభుత్వ ఖజానాకు ఎంత భారంపడినా కూడా ఎన్టీఆర్ తన హామీలను అమలుపరిచాడు. అయితే ఆయన రెండవ భార్య లక్ష్మీపార్వతి పార్టీ, ప్రభుత్వ విషయాలలో విపరీతంగా కలుగజేసుకోవటం వలన ఆయన చాలా సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చింది.

పార్టీలో ప్రముఖులు అభద్రతా భావాన్ని ఎదుర్కొన్నారు. పార్టీలో ముదిరిన సంక్షోభానికి పరాకాష్ఠగా కోంత మంది తిరుగుబాటు చేసారు. అంతటితో ఎన్టీఆర్ రాజకీయ జీవితం ముగిసినట్లయింది, అనతికాలంలోనే.1996 జనవరి 18న 73 సంవత్సరాల వయసులో గుండెపోటుతో ఎన్టీఆర్ మరణించాడు

ముప్పైమూడేళ్ళ తెర జీవితంలోను, పదమూడేళ్ళ రాజకీయ జీవితంలోను నాయకుడిగా వెలిగిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడు.

ఆయన మరణించినపుడు ఈనాడు పత్రికలో శ్రీధర్ వేసిన ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ పట్ల ఉన్న అభిమానానికి అద్దం పడుతుంది.

### ఎన్టీఆర్ జాతీయ పురస్కారం..

ఎన్టీఆర్ పేరిట సినిమా ప్రముఖులకు జీవిత కాలంలో చేసిన సేవకు గుర్తింపుగా ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 1996 లో నెలకొల్పింది. 2002 వరకు ఇస్తూ వచ్చిన ఈ అవార్డును ప్రభుత్వం తరువాత నిలిపివేసింది. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 2006 జనవరి 18 న ఈ పురస్కారాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### అన్న ఎన్టీఆర్ విశిష్టత

సిసలైన ప్రజానాయకుడు ఎన్టీఆర్.ఆంధ్రప్రదేశ్‌లో, ఆయన సమకాలికుల్లో ఆయనంతటి ప్రజానాయకుడు మరొకరు లేరు. వటవృక్షంలాంటి కాంగ్రెసు పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో దీటైన ప్రత్యామ్నాయాన్ని నిలబెట్టిన గొప్పదనం పూర్తిగా ఎన్టీఆర్‌దే.

పట్టుదలకూ, క్రమశిక్షణకు మారుపేరైన వ్యక్తి ఆయన. ఈ కారణాలవల్లనే కాంగ్రెసు పార్టీని ఎదుర్కొని స్థిరమైన ప్రభుత్వాన్నీ, ప్రభావవంతమైన ప్రతిపక్షాన్ని రాష్ట్ర ప్రజలకు ఇవ్వగలిగారు.

- తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్.
- స్త్రీలకు ఆస్తిలో వాటా ఉండాలని చట్టం తెచ్చిన ఘనత రామారావుదే.
- బలహీన వర్గాలకు లక్షలాదిగా ఇళ్ళు కట్టించిన గొప్పతనం ఆయనకు దక్కింది.
- రెండు రూపాయలకే కిలో బియ్యం వాగ్దానం చేసి, ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు ఓర్చి, తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు.
- తెలుగుగంగ ప్రాజెక్టులో పట్టుబట్టి రాయలసీమ సాగునీటి అంశాన్ని చేర్చిన ఘనత కూడా ఎన్టీఆర్‌దే.
- దేశంలో ప్రధాన ప్రతిపక్షాలను ఒకతాటిపైకి తెచ్చిన నేత ఆయన.
- ఎందరో కొత్తవారిని, బాగా చదువుకున్నవారిని రాజకీయాలకు పరిచయం చేసి, ఒంటిచేత్తో వారిని గెలిపించిన ప్రజానాయకుడు ఆయన. దేవేందర్ గౌడ్, కె.చంద్రశేఖరరావు మొదలైన నేతలు ఆయన పరిచయం చేసినవారే.
- "నక్సలైట్లు కూడా దేశభక్తులే బ్రదర్" అంటూ సమర్థించటం ఒక విశేషం.
- మదరాసులో ఆయన వుండగా తిరుపతి వెళ్ళిన తెలుగు యాత్రీకులు మొక్కుబడిగా మదరాసు వెళ్ళి ఆయనను దర్శించుకుని వచ్చేవారు.
- కొన్ని సాహసోపేత నిర్ణయాలు: మహిళలకు ఆస్తి హక్కు, వెనుకబడినకులాల వారికి రిజర్వేషన్లు, పురోహితులుగా ఎవరైనా ఉండవచ్చుననే అంశం
- రామారావుగారికి బాబాల, మాతల పిచ్చి లేదు. దేవునిపట్ల భక్తి ఉంది. బుద్ధునిపట్ల అపార గౌరవమున్నది.
- ముఖ్యమంత్రి కాగానే సుప్రసిద్ధ జర్నలిస్టు, ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు గారిని సాంస్కృతిక సలహాదారుగా వేసుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అప్పటిదాకా రెడ్డి కులం వారికి మాత్రమే అన్ని రాజకీయ పదవులను కట్ట బెట్టడంతో, ఎన్టీఆర్ మిగతా కులముల వారికి ఆశాకిరణం లాగ కనిపించారు ఎన్టీఆర్. మొట్టమొదటిసారిగా అన్ని కులముల వారికి ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల వారికి తెలుగుదేశం పార్టీలో ఉన్నత పదవులు కల్పించారు అయన చేసిన కృషి ఫలితంగా ఈనాటికి బడుగు బలహీన వర్గాలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు.
- తెలంగాణాలో బడుగు బలహీనవర్గాలని పట్టి పీడుస్తున్న పటేల్ పట్వారి వ్యవస్థ లని రద్దు చేసి తెలంగాణాలోని బడుగు బలహీన వర్గాలకి ఆరాధ్యదైవంగా మారినారు!
- ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన జనతా వస్త్రాల పథకం

### 302 సినిమాలు చేశారు

నాటికీ.. నేటికీ ఒకే ఒక్కడు నందమూరి తారకరామారావు గారు కాలం పరుగులుతీస్తున్నా నేటికీ కళ్లముందు కనిపించే మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. తెలుగువారి గుండెల్లో ఆరని జ్యోతి ఎన్టీఆర్. మరచిపోని మధురస్మృతులే ఆయనకు మనం అందించే నీరాజనం.

- చాగంటి కనకయ్య

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024



## ఎన్టీఆర్.. సింగిల్ పీస్!

ఎన్టీఆర్ అంటే ఎన్టీఆర్ ఒకే ఒక్కడు, సింగిల్ పీస్ ఇన్ ద వరల్డ్ ! ఆయన శత జయంతి పూర్తి నేడు. ఆయనపై కొందరి ట్రోల్స్ చూశాను, ఆయనలో కొన్ని లోపాలు ఉండొచ్చు, ఒకే యుగ పురుషుడు అని చెప్పనుకానీ, మాట మార్చని మడమ తిప్పని ఆత్మాభిమాన ధనుడు, ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నా అందరినీ తిన్నగా ధైర్యంగా ఎదుర్కొన్నారు. అయితే ఆయన 95లో పదవీచ్యుతులు చేయబడి, దివంగతులైననాటి అప్పటి పరిస్థితులు మాత్రం నాలాంటి వారికి బాధ కలిగించాయి.

అప్పటి పార్లమెంట్ ఎన్నికల వరకు అధికారంలో ఉండి ఉంటే కచ్చితంగా దేశ ప్రధానమంత్రి అయ్యేవారు, సామాన్య ప్రజల కోసం వినూత్నమైన మార్పులు తీసుకుని వచ్చేవారు. అయితే ఈ భారతదేశ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే వ్యక్తి, ఈ ప్రపంచంలో తెలుగు జాతి ఉన్నంత వరకు గుర్తుంచుకునే గొప్ప నాయకుడు, గొప్ప నటుడు. తెలుగు నాట ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు మరియు సామాజిక విప్లవానికి ఆద్యుడు.

1984లో ఆయన్ని దింపేసినప్పుడు వేరే రాష్ట్రంలో ఉండే నేను అవన్నీ వదిలేసి తిరిగివచ్చి ఆయన్ని ముఖ్య మంత్రిగా చేసేంతవరకు చాలా గట్టిగా ఉద్యమించాను. ఆయనపై నా అభిప్రాయాలు స్థిరంగానే ఉన్నాయి, రాజకీయాల, పరిస్థితులబట్టి ఉండవు. మా ఇంట్లో పెళ్లికి వారి నలుగురు కుటుంబ సభ్యులు వచ్చింది నా జీవితాంతం గుర్తుంచుకుంటాను.

ఈ దేశ చరిత్రలో ఏ కాలేజీ పాలిటిక్స్ లేదా పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఒక పార్టీ పెట్టి 9 నెలలలో ఒక పెద్ద రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాకుండా, వచ్చిన సంవత్సరంన్నరలో ఈ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఐదు సంవత్సరాలు వ్యవహరించే స్థాయికి తీసుకెళ్లి వ్యక్తి కాదు కాదు ఒక శక్తి. జనతా ప్రయోగం విఫలం అయిన తర్వాత తిరిగి దేశంలో ప్రతిపక్ష నాయకులు అందర్నీ బెజవాడకు పిలిచి ఏకం చేసిన జాతీయ నాయకుడు.

నేషనల్ ఫ్రంట్ చైర్మన్గా 1989లో ఏపీ సింగ్ ప్రభుత్వం వచ్చినప్పుడు గురుతరమైన బాధ్యత నిర్వహించినవారు. వారితో నాకు పరిచయం ఉన్నా, అది తక్కువ పరిచయం అయినా ఆయనంటే ఒక అభిమానం.. కానీ అది గుడ్డి అభిమానం కాదు, తెలుగునాట రాజకీయ, సంక్షేమ విప్లవం తీసుకొచ్చినదానికి అభిమానం. తెలుగువారికి ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు రావడానికి కారకులైన పెద్దలలో ఒకరు. తెలుగునాట ఎన్నో వాటికి ఆద్యులు వారు.

మొట్టమొదటిసారి బీసీ కులాలకు రాజకీయ రిజర్వేషన్లు ఏర్పాటు చేసిన నాయకుడు, తెలుగుగంగ, %ఖాదీ=% ఇంకా ఎన్నో ప్రాజెక్టులకు ఆద్యులు, రెండు రూపాయల కిలో బియ్యం, మహిళలకు దేశంలో మొదటిసారి ఆస్తి హక్కు, మధ్యాహ్న భోజన పథకం, పేదలకు సబ్సిడీ రేట్లకు వస్త్రాలు, రైతులకు భూమిశిస్తు రద్దు, విద్యుత్ హార్స్ పవర్ కు 50 రూపాయలకే అలాగే పటేల్ పట్వారి మరియు గడీల వ్యవస్థకు అంతం దాంతోపాటే ప్రజలే దేవుళ్ళు అంటూ మండల వ్యవస్థ ఏర్పాటు, తెలుగు విశ్వవిద్యాలయం మరియు దేశంలో మొదటిసారి మహిళలకు విశ్వవిద్యాలయం ఏర్పాటు, మెడికల్ కళాశాలలలో డోనేషన్ సిస్టం రద్దు.


అప్పటికి రాష్ట్రంలో ఒకే మెడికల్ ప్రైవేట్ కళాశాల అదీ తన బంధువులకు చెందినా సరే దాన్ని ప్రభుత్వం తీసుకుని రాష్ట్రంలో కోస్తా తెలంగాణ రాయలసీమ అన్ని ప్రాంతాలకు దానిలో హక్కు కల్పించడం (నేటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాలకి జనాభాను బట్టి ప్రాతినిధ్యం ఉన్న ఏకైక ప్రభుత్వం మెడికల్ కళాశాల అదే), మరియు తిరుమలలో నిత్యాన్న దాన పథకం మొదలు, పోలీసు వ్యవస్థ పటిష్టం, హైదరాబాదులో మతకల్లోలాలకు ముగింపు.

ఈ దేశంలో మొదటిసారి పేదలకు పక్కా ఇళ్లు కట్టించడం, అసలు పార్టీ పెట్టినప్పుడు తమ పార్టీలోకి వచ్చేవాళ్ళు ఎవరైనా సరే కచ్చితంగా వారి పదవులకు రాజీనామా చేయాలని నిబంధన పెట్టి అమలు చేయించిన నాయకుడు ఒకటా రెండా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో. ఆయనకు చాలాకాలం క్రితం ఒక శిలా విగ్రహం ఏర్పాటుచేసి, నలుగురూ కూర్చోడానికి చిన్న కాలక్షేప మండపాన్ని ఏర్పాటు చేయడంలో ముఖ్యదాతగా ఉన్నాను, క్రితం సంవత్సరం అక్కడికి వెళ్ళినప్పుడు తీసిన చిత్రం షేర్ చేసాను.

- చలసాని

## ఎన్టీఆర్‌లో ఇదో 'పెద్దన్న' కోణం

అన్న ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సచివాలయంలో అయిదోదో.. ఆరవదో.. అంతస్తులో ఉన్న ఆయన ఆఫీస్ కు వెళ్ళడానికి ప్రత్యేకంగా ఒక లిఫ్ట్ ఉండేది. ఆయన



లిఫ్ట్ దగ్గరకు రాగానే భద్రతా కారణాల దృష్ట్యా మిగిలిన అన్ని లిఫ్టులను ఆపేసే వారు. అన్న ఎన్టీఆర్ తన ఆఫీస్ లోపలకు వెళ్ళి కుర్చీలో కూర్చున్న తరువాతే లిఫ్టులు మళ్ళీ పని చేసేవి.!!

అన్నగారు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ ఒకే ఉద్యోగి లిఫ్టు ఆపరేటర్గా ఉండేవాడు. ఆ కారణంగా అతనికి అన్న గారితో కొంచెం చనువు ఉండేది. ఎన్టీఆర్ కూడా అతనిని రోజూ చూస్తుంటారు కాబట్టి నవ్వుతూ బాగున్నావా అని అడిగేవారు.!!

ఒకరోజు అన్నగారు ఆఫీస్ లో ఉండగా సాయంత్రం ఆ ఉద్యోగి ఆఫీస్ లోకి వెళ్ళి నమస్కారం చేశాడు. ఆ సమయం లో అప్పటి సభాపతి మరి కొందరు ఉన్నారు.

అన్నగారు ఆశ్చర్యంగా అతణ్ణి చూసి "ఏమిటి?" అని అడిగాడు.

"సార్..నేను ఈ సాయంత్రం తో రిటైర్ అవుతున్నాను. మా యూనియన్ వారు చిన్న పార్టీ ఇస్తున్నారు. చివరి సారిగా మీకు చెప్పి వెళదాం అని" చెప్పాడు అతను.

అన్న ఎన్టీఆర్ ఆశ్చర్యంగా చూసి " అరే..పొద్దున్న చెప్పలేదే? ఉండు" అని తన కార్యదర్శులకు ఫోన్ చేసి అర్జెంట్ గా ఒక శాలువా, బోకే తెమ్మని ఆదేశించారు. ఈ లోపల ఆ ఉద్యోగి కుటుంబ వివరాలను అడిగారు. అతనికి సొంత ఇల్లు లేదని, పెళ్ళి కావలసిన కుమార్తెలు ఉన్నారని తెలుసుకుని సెక్రెటరీ ని పిలిచి ఆ ఉద్యోగి పేరుతో ఒక ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతంలో రెండు ఎకరాల భూమికి పట్టా కాగితాలు అరగంట లోపల సిద్ధం చెయ్యమని ఆదేశించారు.

ఇంతలో శాలువా, బోకే, స్వీట్స్ వచ్చాయి. అన్న ఎన్టీఆర్ ఆ ఉద్యోగికి స్వయంగా సన్మానం చేసి, తన జేబులోంచి కొంత నగదు తీసి పట్టా కాగితాలతో సహా అందించి, అవసరం అయితే కలవమని చెప్పి పంపించారు.!! ఆనందబాష్పాలు రాలుస్తూ వెళ్ళిపోయాడు ఆ ఉద్యోగి. ప్రచారానికి నోచుకోని ఇలాంటి కోణాలు అన్న ఎన్టీఆర్‌లో ఎన్నో ఉన్నాయి..

## సంక్షేమ రాజ్య నిర్మాత ఎన్.టి.ఆర్

ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు గారు ఆత్మగౌరవ పరిరక్షణ,అభివృద్ధి సాధన,అవినీతి,పేదరిక నిర్మూలనే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని స్థాపించారు.తెలుగు నాట సంక్షేమ పథకాల యుగం ప్రారంభమైంది తెలుగుదేశం ఆవిర్భావంతోనే అని చెప్పాలి. పదవుల కోసం ఏర్పడిన పార్టీ కాదు, పేద ప్రజల అభ్యున్నతి కోసం అని గొప్పగా చాటిన వ్యక్తి ఎన్ టి ఆర్.సమాజమే దేవాలయం.ప్రజలే దేవుళ్లని నినదించిన మానవతా వాది .త్రికరణశుద్ధిగా ఆచరించిన ధన్యజీవి ఆయన.

నిరుపేదలను ఆదుకోవడానికి అవసరమైన సంక్షేమ పథకాలను నాలుగు దశాబ్దాల క్రితమే అమలు చేసి చూపించారు ఎన్ టి ఆర్. స్వాతంత్ర భారత దేశ చరిత్రలో పెద వాడి సంక్షేమం గురించి ఆలోచించిన తొలి రాజకీయ నాయకుడు ఆయన.ఆ రోజు ఎన్ టి ఆర్ ప్రవేశ పెట్టిన కిలో రెండు రూపాయల బియ్యం పథకం నేడు ఆహార భద్రత పథకం దేశమంతా అమలు అవుతుంది.ముందు చూపుతో ఎన్ టీఆర్ ప్రవేశ పెట్టిన ఆహార భద్రత ఫుడ్ సెక్యూరిటీ గురించి ప్రపంచ దేశాలన్నీ మాట్లాడటం గమనార్హం అని చెప్పాలి.

ఇప్పుడు అమలు అవుతున్నఉపాది హామీ పథకాన్ని1984 మార్చి2న అసెంబ్లీలో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వాని పంపించారు ఎన్ టీఆర్. పార్టీ పెట్టిన సందర్భంలో కొందరు మీ సిద్దాంతం ఏమిటని అడిగినప్పుడు పేదవాడికి పట్టెడన్నం పెట్టడం,నిలువనీడ కల్పించడం,ఒంటి నిండా బట్టకప్పుకొని ఆత్మగౌరవంతో జీవించే పరిస్తితి కల్పించడం అన్నారు ఆయన .

1983లో ఎన్.టి.ఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టిన పథకాలను పరిశీలిస్తే ప్రతి పథకంలో మానవతా దృక్పదం కనిపిస్తుంది. పేదవారికీ ఎన్నోసంక్షేమ పథకాలను సృష్టించి సంక్షేమ రాజ్య నిర్మాతగా నిలిచారు ఎన్ టి ఆర్. మొట్ట మొదటి సారి ఆదరణ లేని 65 ఏళ్ళు నిండిన పేద వృద్దులకు నెలకు రూ 30 పింఛను పథకాన్ని ప్రవేశ పెట్టారు.

ఆనాడు ఏటా 2,27 లక్షల మందికి సాయం అందించారు. అనాథ వితంతు మహిళలకు,రూ 50 రూపాయలు పింఛను పథకం అమలుచేసీ అప్పట్లో 55 వేల మందికి ప్రతినెలా ఇచ్చారు. 60 ఏళ్లు నిండిన 5.64 లక్షల వృద్ధ వ్యవసాయ కార్మికులకు నెలకు రూ30 పింఛను పథకం అమలు చేశారు ఎన్ టీఆర్. ఆకలితో అలమటిస్తున్న పెద ప్రజలకు కిలో రూ 2లకే 25 కిలోల బియ్యం అందించి పేదల కడుపు నింపిన కరుణామయుడు ఎన్ టి ఆర్.

ఆంధ్రప్రదేశ్‌లో కోటి 43 లక్షమంది కుటుంబాలకు సబ్సిడీ బియ్యం ద్వారా లబ్ది చేకూరింది.ఏడాదికి 18 లక్షల టన్నులు బియ్యాన్ని పేదలకు పంపిణి చేసింది ప్రభుత్వం. నీడలేని నిరుపేదలకు లక్షలాది పక్కాఇళ్ళునిర్మించడం,కట్టుకోవడానికి బట్టలు లేని నిర్భాగ్యులకు సగం ధరకే జనతా వస్త్రాలు చీరలు, ధోవతులు అందించిన మానవతావాదిఎన్టీఆర్. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సబ్సిడీ బియ్యం పథకాన్నిమానవతా దృక్పదంతో అమలు పేదల కడుపు నింపిన కరుణామయుడు. సంస్కరణలు చేపట్టి ప్రజల వద్దకు పాలన తెచ్చిన నాయకుడు.

రైతులకు రూ.50 కే హార్స్ పవర్ విద్యుత్, రైతుల రుణాలు రూ.11 వేల కోట్లు మాఫీ చేయించారు.దేవుడిచ్చిన భూమికి పన్నేమిటి రైతన్నా అంటూ భూమిశిస్తు రద్దు చేశారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ సాధికారత కల్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసిలకు, మహిళలకు రిజర్వేషన్లు-పాలనా సంస్కరణలు చేపట్టారు. మాండలిక వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తెచ్చారు. సింగిల్ విండో సిస్టమ్ తెచ్చారు, సహకార రంగంసాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం (ఎస్సారెస్పీ ఆధునీకరణ, అనేక ఎత్తిపోతల పథకాలు..) డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌లు. చంద్రబాబు హయాంలో.. డ్వాక్రా మహిళా సంఘాల ఏర్పాటు-ఎ 1982 లో వెనుకబడిన వర్గాల అండతోనే తెలుగుదేశం ఆవిర్భవించింది.

ఆ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ విధానాలలో బీసీలకు ప్రయోజనాలు కలించారు. సమాజంలో 50 శాతంగా వున్న వెనుక బడిన వర్గాలను ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, మహిళలను సామాజికంగా,ఆర్ధికంగా ఆదుకోవాలన్న సంకల్పంతో ఎన్టీఆర్ 1987లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు, మహిళలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించారు.

అంతేకాకుండా అప్పటివరకు 14శాతంగా వున్న ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతానికి,4 శాతంగా వున్న ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతానికి పెంచారు ఎన్టీఆర్. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన కులాలు వారు రాజకీయాల్లో బలమైన నాయకులుగా ఎదిగారు.ఆనాడు రాజకీయాలు అంటే ఆగ్రాకుల ఏక చత్రాదిపత్యానికి ,బడుగు బలహీన వర్గాల అణచివేతకు నిదర్శనంగా వుండేది.సమాజంలో అనాదిగా వేళ్లూనుకు పోయిన సామాజిక రుగ్మతలను తొలగించడానికి ప్రయత్నించిన మహామనిషి ఎన్ టీఆర్. రాష్ట్రంలో రాజకీయ,ఆర్థిక,సామాజిక విప్లవం మొదలైంది.రాజకీయాల్లో విలువలకు అంకురార్పణ జరిగింది.వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసి ఫలితాలు సాధించిన పార్టీ తెలుగుదేశం.

సమాజాన్ని పట్టిపీడిస్తున్న దురవస్థలను రద్దు చేసి విప్లవాత్మక విధానాలను పరిపాలన రంగంలో పాదు కొలిపి యావత్ భారతదేశంలోనే అనితర సాధ్యమైన చరిత్ర సృష్టించారు ఆయన. ప్రజా ప్రయోజనాల కొరకు చేపట్టిన సంస్కరణల పట్ల ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎక్కడా వెనకడుగు వెయ్యకుండా సంస్కరణలు చిత్తశుద్ధితో అమలు చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో నెల కొన్న అస్తవ్యస్త విధానాలు, దయనీయ పరిస్థితులు సరిదిద్దేందుకుపాలన వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు,పేదలకు అందుబాటులో లేవన్న వాస్తవాన్ని గుర్తించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ వేళ్ళను కొన్న దన్న నిజాన్ని గుర్తించారు ఎన్.టి.ఆర్. బ్రిటీష్‌వార సత్వంగా సంక్రమించిన అనేక జాడ్యాలు పాలనా వ్యవస్థలో పెనవేసుకున్న విషయాన్ని గ్రహించి ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా, నాణ్యతతో సామాన్యులకు అందించాలని వాటిని కూకటి వేళ్లతో పెకిలించి వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాతుకు పోయి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న పెత్తం దారీ వ్యవస్థను పెకిలించివేశారు. పటేల్, పట్వారీ వ్యవస్థను నిర్మూలించి తెలంగాణ ప్రజలకు నిజమ్కైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లో [కరణం,మునుసుబు], తెలంగాణలో పటేల్,



పట్వారీ వ్యవస్థను రద్దు చేసారు.అవి రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యవస్థ అని వాటి జోలికి వెళ్లవద్దని కొందరు చేసిన హెచ్చరికలను పట్టించుకోలేదు ఎన్ టి ఆర్. బ్రిటీష్ పెత్తందారీ వ్యవస్థకు వారసత్వంగా వున్న తహసీల్దార్ వ్యవస్థను రద్దు చేశారు.గ్రామ స్థాయి వ్యవస్థను రద్దు చెయ్యడంతో ఎన్ టి ఆర్ తృప్తి చెందలేదు.పరిపాలన గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

అధికార వికేంద్రీకరణతో ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు మండలి వ్యవస్థకు నాంది పలికి ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని నడిపించి గ్రామ స్వరాజ్యానికి పునాది వేశారు. మండల యూనిట్ గా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పరచడానికి మాండలిక వ్యవస్థను ప్రవేశ పెట్టడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. 330 తాలూకాలను రద్దు చేసి 1104 మండలాలుగా విభజించారు. 35వెల నుండి 60 వేలమంది ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో వుండే విధంగా చర్యలు తీసుకొన్నారు.

అధికారులను,ప్రజా ప్రతినిధులను ప్రజల వద్దకు పంపించి ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించి వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రజలవద్దకు పరిపాలన చేర్చిన ఘనత ఎన్ టి ఆర్ దే. స్థానిక సంస్థలకు మూడంచల విధానం ద్వారా పంచాయితీ రాజ్ ,స్థానిక సంస్థలకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించడం వంటివి ఎన్టీఆర్ సంస్కరణల విజయాలే. పరిపాలనలో పారదర్శకతకు, స్వచ్ఛతకు పెద్ద పీట వేశారు. ప్రజలకు ఎంత మాత్రం ప్రయోజన కారిగా లేని శాసన మండలిని రద్దు చెయ్యడం కూడా సాహసోపేతమైన నిర్ణయమే.

జాతీయ భావాలున్న ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం. తెలుగునాట విలక్షణ రాజకీయ వ్యవస్థగా ఏర్పడి అధికారంలో వున్నా,లేకున్నా ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న భాధ్యత గురుతరమైనది. దేశ రాజకీయ చరిత్రలో ఎందరో రాజకీయ నాయకులు తెరమరుగై పోయ్యారు.కానీ ఎన్టీఆర్ రాజకీయాల్లో మేరునగ శిఖరంలా ఈ నాటికి కనపడటానికి కారణం ఆయనకు వున్న ప్రజల పట్ల అంకిత భావం, పట్టుదల, మొక్కవోని స్థైర్యం,నిష్కలంక రాజకీయం అని చెప్పక తప్పదు. రాష్ట్రాలలో గవర్నర్ల పాత్రపై ఆయన జాతీయ స్థాయిలో చర్చజరిగే విధంగా గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని కోరారు.

నిధులు కోసం పదే,పదే డిల్లీ వెళ్ళి దేబిరించాల్సిన దుస్థితి పట్టింది అని రాష్ట్రాలకు అందవలసిన న్యాయమైన హక్కులను, నిధులను హరించే అధికారం కేంద్రానికి లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు,విమర్శలు దేశ వ్యాప్త చర్చకు దారితీసాయి.ఆ విధంగా కేంద్రాన్ని నిలదీసిన కారణంగానే కేంద్రం-రాష్ట్రాల మధ్య సంబందాలను, ఆదాయ వాటాలను పునఃపరిశీలించడానికి సర్కారియా కమీషన్ ఏర్పాటు అయింది.

ఎన్.టి.ఆర్ చూపిన చొరవ కారణంగానే ఆ తరువాత కాలంలో రాష్ట్రాలకు కేంద్రం నుండి మరిన్ని అధికారాలు దక్కడానికి దోహద పడ్డాయి. ఎవరు ఏమన్నా చిత్తశుద్ధి, నిబద్ధత, నిజాయితీ,వంటి సంకల్పాలతో దీక్ష బూని అమూల్యమైన ఆశయాలను తెలుగు జాతికి అందించి కీర్తి కిరణమైన దివ్యమూర్తి ఎన్టీఆర్. అందుకే ఎన్టీఆర్‌కు సరిలేరు ఎవ్వరూ, అందుకే ఆయనకు ఘనంగా నివాళులు అర్పిద్దాం. ఆయన కీర్తి అజరామరం.ఆ మహానుభావుడికి భారతరత్న ఇవ్వాలని యావత్ తెలుగు ప్రజల అందరి తరపున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం.

- నీరుకొండ ప్రసాద్,

సీనియర్ జర్నలిస్ట్, 9849625610

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024





# ఎన్టీఆర్ కీర్తి అజరామరం

- సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ
- మంగళగిరి పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు
- నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు

**మంగళగిరి, మహానాడు:**

ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూల



మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం సభలో సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో కథానాయకుడిగా ఎదురులేని మనిషిగా, రాజకీయాల్లో ప్రజానాయకుడిగా తిరుగులేని మనిషిగా.. వెరసి ఎన్టీఆర్ అంటే ఒకే జీవితంలో రెండు చరిత్రలు సృష్టించిన అద్వితీయ చరితుడు, యు గపురుషుడని కొనియాడారు. దేశంలో సంక్షేమ పాలనకు ఆద్యుడని ప్రశంసించారు. తెలుగుజాతి ఆత్మ గౌరవానికి ప్రత్యేకగా చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన మహానుభావుడిగా ఆయన కీర్తి అజరామరంగా నిలిచిపో తుందన్నారు. ప్రతి తెలుగుబిడ్డ గుండెలో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపో తారని నివాళులర్పించారు. కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కారణజన్ముడు, మరణం లేని జననం నందమూరి తారక రామారావుగారిదని కొనియాడారు. తెలుగువారి ఘనతను



ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలి

నిత్యం దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రయాణికులు రైళ్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఉంది. సీట్లు తక్కువగా ఉండటం, స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో ఊపిరాడక చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలున్నాయి. రెండో అతిపెద్ద రవాణా వ్యవస్థగా ఉన్న రైల్వేలు ప్రజలకు అందిస్తున్న సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అదే సమయంలో దూర ప్రాంత ప్రయాణాలకు అను వుగా ఉండే అనేక రైళ్లలో స్లీపర్ క్లాస్ బోగీల కుదింపు వేగంగా జరుగుతోంది. స్లీపర్ బోగీలను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. స్లీపర్ స్థానంలో ఏసీ బోగీల సంఖ్య ను పెంచుతున్నారు. విశాఖ, గోదావరి, ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల తరహాలో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్ బోగీలకు కోత



పడుతోంది. ఫలితంగా సీటు లేదా బెర్త్ రిజర్వేష న్ దొరక్క ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎంతముందుగా ప్రయాణం కోసం రిజర్వు చేయించుకోవాలని ఆశించినా సెలవులు, పండుగల సందర్భాల్లో టిక్కెట్లు దొరకట్లేదు. ఫలితంగా జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణించేవారు నిల్చో వడానికి కూడా ఖాళీ దొరక్క స్లీపర్ క్లాసు బోగీల్లో ఎక్కేస్తున్నారు. ఇది రిజర్వేషన్ లేని వారితో పాటు, రిజర్వేషన్ ఉన్న ప్రయాణికులకు కూడా ఇబ్బందిగా మారుతోంది. జనరల్ బోగీలతో సమానంగా ఇప్పుడు రిజర్వుడు స్లీపర్ క్లాస్ బోగీలు కిక్కిరిసి పోతున్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర సమస్యలను ఎదు ర్కొంటున్నారు. వేసవిలో దూర ప్రయాణాలకు వెళ్లేవారి సమస్య ఇంకా తీవ్రంగా ఉంది.

ఇప్పటికైనా రైల్వే మంత్రిత్వ శాఖ వారు సామాన్య ప్రయాణికుల ప్రయో జనాలను దృష్టిలో ఉంచుకుని సాధారణ, స్లీపర్ క్లాస్ బోగీలను పెంచాల్సిందిగా కోరుతున్నాం.

- అప్పన్న గొనప, విశాఖపట్నం,
9440733620

# సీఎస్ జవహర్‌రెడ్డికి చంద్రబాబు లేఖ

- కంబోడియాలో చిక్కుకున్న తెలుగు యువకులు
- బాధితులను తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని వినతి

**అమరావతి, మహానాడు:**

కంబోడియాలో చిక్కుకున్న తెలుగు యువకులను రాష్ట్రానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం సీఎస్ జవహ ర్‌రెడ్డికి లేఖ రాశారు. ఏపీకి చెందిన వందలాది మంది యువకులు కంబోడియా లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఉపాధి అవకాశాలు కల్పి స్తామని నకిలీ ఏజన్సీలు యువతను మోసం చేశాయని, ఈ వ్యవహారం ఎన్ఐఏ విచారణలో బయటపడిరదన్నారు. బాధిత యువతను రప్పించేందుకు రాష్ట్ర ప్రభు త్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కాంబోడియా, లావో స్, ఇతర ప్రాంతాల నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ బాధిత యువత గమ్యస్థానాలకు చేరుకుంటోందని, కేంద్రప్రభుత్వంతో



సంప్రదించి వీల్కెనంత త్వరగా బాధితులను తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

# సీఎస్‌ను తొలగించి సీబీఐ విచారణకు ఆదేశించండి

- ఆయన ఉంటే కౌంటింగ్ సజావుగా జరుగుతుందన్న నమ్మకం లేదు
- అధికార యంత్రాంగాన్ని, అధికారాలను దుర్వినియోగం చేశారు
- కొడుకు, బినామీల పేరిట 800 ఎకరాలు కొన్నారు
- రిజిస్ట్రేషన్ కోసం అధికారులను ప్రభావితం చేస్తున్నారు
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు కనకమేడల లేఖ

**న్యూఢిల్లీ, అమరావతి:**

అధికారాలను దుర్వినియోగం చేసిన సీఎస్ జవహర్‌రెడ్డిని కౌంటింగ్ బాధ్యతల నుంచి తప్పించాలని టీడీపీ నేత కనకమేడల రవీంద్రకుమార్ మంగళవారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి ప్రభుత్వ అసైన్డ్ భూములను పెద్దఎత్తున కొనుగోలు చేశారని వెల్లడించారు. తన కుమారుడు, బినామీల పేరిట సీఎస్ 800 ఎకరాలు కొనుగోలు చేశారని కనకమేడల తెలిపారు. ఇప్పుడు భూముల రిజిస్ట్రేషన్ కోసం అధికారులను ప్రభావితం చేస్తున్నారని తన లేఖలో పేర్కొన్నారు. సీఎస్ అధికార యంత్రాంగాన్ని, తన అధికారా లను దుర్వినియోగం చేశారని వివరించారు. ఎన్నికల నియ మావళిని కూడా ఉల్లంఘించారని తెలిపారు.


ఈ నేపథ్యంలో కౌంటింగ్ సజావుగా జరుగుతుందన్న నమ్మకం ప్రతిపక్షాలకు లేదని వెల్లడిరచారు. సీఎస్ వ్యవహార శైలి ఓట్ల లెక్కింపుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనను తొలగించి సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు.

# మండలి బుద్ధప్రసాద్ వివాహానికి ఎన్టీఆర్

- జ్ఞాపకాలను పంచుకున్న అవనిగడ్డ టీడీపీ అభ్యర్థి
- తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రదాత ఎన్టీఆర్ ప్రశంస
- జయంతి సందర్భంగా ఘన నివాళి

**అవనిగడ్డ, మహానాడు:**

తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రదాత ఎన్టీఆర్ అని అవనిగడ్డ టీడీపీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. మంగళవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అవని గడ్డలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన వివాహానికి ఎన్టీఆర్ స్వయంగా హాజరైన ఫొటోలను సోషల్ మీడియా వేదిక ద్వారా పంచుకున్నారు. ఎన్టీఆర్ తమ వివాహానికి విచ్చేసి ఆశీస్సులు అందించడం మధురానుభూతిగా నేటికీ నిలిచి ఉందన్నారు. పేదల ఆశాజ్యోతి ఎన్టీఆర్ చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందారన్నారు. సినిమా రంగంలో ఎన్నో విభిన్న పాత్రలకు జీవం పోసి విశ్వ విఖ్యాత, నటసార్వభౌముడుగా, ఆంధ్రప్రదేశ్ అభిమానుల గుండెల్లో చెరగని



ముద్ర వేయించుకున్నారని కొనియాడారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న నినాదంతో పేదల సంక్షేమ రాజ్యానికి బాటలు వేసిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడని ప్రశంసించారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి అడుగు ప్రజల కోసం

- టీడీపీ నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు సందేశం
- 101వ జయంతి సందర్భంగా స్మరించుకుంటూ నివాళి

**అమరావతి, మహానాడు:**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంగళవారం ఆయనను స్మరించుకుంటూ సందేశమిచ్చారు. తెలుగు వెలుగు, తెలుగుజాతికి స్ఫూర్తి, కీర్తి అన్న ఎన్టీఆర్. ఆ మహనీయుడి 101వ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తూ అన్నగారి సేవలను స్మరించుకుందాం. క్రమశిక్షణ, పట్టుదల, చిత్తశుద్ధి, ప్రజలకు మంచి చేయాలనే తపనే ఒక సామాన్య రైతుబిడ్డ అయిన తారక రాముడిని మహానాయకుడిగా తీర్చిదిద్దాయి. సమాజమే దేవాలయం -ప్రజలే దేవుళ్లు అని త్రికరణ శుద్ధిగా నమ్మిన ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపనతో దేశంలోనే మొదటిసారిగా సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారు. పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వడమే అధికారానికి అర్థం అని చెప్పి ఆచరించి చూపారు. సంక్షేమంతో పాటే అభివృద్ధికి, పాలనా సంస్కరణలకు కూడా బాటలు వేశారు. ప్రజల వద్దకు పాలనతో పాలకుడు అంటే ప్రజలకు సేవ కుడు అని చాటి చెప్పారు. ప్రజల అభ్యున్నతే



ఏకైక లక్ష్యంగా పనిచేసిన ఎన్టీఆర్ అన్ని వర్గాల ప్రజల ఆత్మబంధువు అయ్యారు. పేదరికం లేని రాష్ట్రం కోసం, తెలుగుజాతి వైభవం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అన్న ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ఆయన జయంతి సందర్భంగా ప్రతి అడుగూ ప్రజల కోసం అనే సంకల్పం తీసుకుందామని పిలుపునిచ్చారు.

# గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు తొలిసారి భారీ విమానం

- అంతర్జాతీయ హెూదా తర్వాత ఎయిర్ బస్ 340 రాక
- ఘనస్వాగతం పలికిన విమానాశ్రయ అధికారులు

**అమరావతి, మహానాడు:**

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎయిర్ బస్ 340 ఎయిర్ క్రాఫ్ట్ మొదటిసారి వచ్చింది. హజ్ యాత్రికులను తీసుకెళ్లేందుకు లెజెండ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం సోమవారం ఉదయం ఇక్కడకు చేరుకుంది. పెద్ద విమానాని కి సెరిమోనియల్ వాటర్ కానన్ సల్యూట్‌లో విమానాశ్రయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అంతర్జాతీయ హెూదా వచ్చిన తర్వాత భారీ విమానాల రాకపో కలు వీలవుతుందని వినడమే కానీ, ఎప్పుడూ చూడలేదని స్థానికులు పేర్కొన్నారు. పెద్ద పక్షిలా భారీ



శబ్దంతో రాకపోకలు సాగించిన ఈ విమానాన్ని చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

సాధారణ విమానంలో 200 మంది ప్రయాణం చేస్తారు. కానీ ఎయిర్‌బస్ 340 ఎయిర్ క్రాఫ్ట్‌లో సుమారు 300 నుంచి 350 మంది ప్రయాణం చేయవచ్చు.

# పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు నిర్వహించాలి

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా

## బాపట్లలో అధికారులతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

**బాపట్ల, మహానాడు:**

జిల్లా పర్యటనలో భాగంగా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా మంగళవారం సాయంత్రం పరిశీలించారు.

ఎటువంటి సమ స్యలు రాకుండా పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు నిర్వ హించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్, ఆర్‌ఓలతో ఆయన సమావేశమయ్యారు.

ఎన్నికల కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలని ఆదేశించారు. కళాశాల ప్రవేశ ద్వారం నుంచి 100 మీటర్ల దూరంలో వాహనాలను నిలిపివేయాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించరాదని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్వో సత్తిబాబు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, ఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీకి వర్ల రామయ్య లేఖ

**మంగళగిరి, మహానాడు:**

దళితుడ్కెన నోముల మాణిక్యారావుపై దాడి ఘటనపై డీజీపీకి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మంగళవారం లేఖ రాశారు. దళితుడ్కెన నోముల మాణిక్యారావును, ఆయన కుటుంబంపై జరిగిన దాడి గురించి ఇది వరకే ఫిర్యాదు చేశామని తెలిపారు. మంగళగిరి రూరల్ స్టేషన్‌లో హత్యా యత్నంపై ఆధారాలు ఇచ్చినా 307 సెక్షన్‌ను చేర్చలేదని తెలిపారు. ఎన్నికల ఏజెంటుగా కూర్చున్నందుకే మాణిక్యారావును హత్య చేసేందుకు దాడి చేశారని వివరించారు.

ఎస్ఐకు వైసీపీ నేతలతో ఉన్న సంబంధాలతోనే హత్యాయత్నం కేసు పెట్టలేదన్నారు. 307 సెక్షన్ చేర్చేలా ఆదేశాలు ఇవ్వాలని, వివక్షపూరితంగా వ్యవహరిస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, మే 2024





# ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు

- పోలీసుల అప్రమత్తం...విస్తృతంగా తనిఖీలు
- భట్టి విక్రమార్క నివాసంలో డాగ్‌స్క్వాడ్ బృందం
- ఫోన్ చేసిన వ్యక్తి కోసం ఆరా

హైదరాబాద్, మహానాడు:

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబం నివాసం ఉంటున్న ప్రజా భవన్‌లో బాంబు ఉన్నట్లు అజ్ఞాత వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి చెప్పడంతో రాష్ట్ర పోలీస్ శాఖ వెంటనే అప్రమత్తమైంది. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, హైద రాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ పోలీస్ అధికారులను రంగంలోకి దింపింది. బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ప్రజాభవన్‌కు చేరుకుని అడుగడుగున తనిఖీలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పంజాగుట్ట ఏసీపీ మనోహర్‌కుమార్ తన సిబ్బందితో చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రజాభవన్ ఎంట్రన్స్ నుంచి నివాసం లోపల ఉన్న అన్ని గదులను, బెడ్రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, విజిటర్ హాల్స్, ఉప ముఖ్యమంత్రి చాంబర్, జిమ్, గార్డెన్, పరిసర ప్రాంతాలను అణువణు వునా డాగ్ స్క్వాడ్ బృందం, పోలీసులు తనిఖీలు చేశారు. భట్టి విక్రమార్క కాన్వా య్, కుటుంబసభ్యులు వాడుతున్న వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించా రు. ఆ తర్వాత ప్రజాభవన్‌లో ఉన్న అమ్మవారి ఆలయంలో తనిఖీలు చేశారు. ప్రజాభవన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.

### ఫోన్ చేసిన వ్యక్తి కోసం అన్వేషణ

ప్రజాభవన్‌లో బాంబు ఉన్నట్లు ఫోన్ చేసిన వ్యక్తి కోసం పోలీసులు అన్వేషణ మొదలుపెట్టారు. సెల్‌ఫోన్ సిగ్నలింగ్ ఆధారంగా కనిపెట్టే పనిలో పడ్డారు. ఫోన్ చేసిన వ్యక్తి ఆకతాయా లేక కావాలని ఉద్దేశపూర్వకంగానే ఫోన్ చేశాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రజాభవన్‌లో బాంబు ఉందని ఫోన్ రావడంతో పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా కలకలం రేగింది.



# దర్శిలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

- నివాళులర్పించిన గొట్టిపాటి లక్ష్మి
- కేక్ కట్ చేసి వృద్ధాశ్రమంలో అన్నదానం

దర్శి,మహానాడు:

ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా ముండ్లమూరు, దర్శి టీడీపీ కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. వృద్ధా శ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నాయకులు గోరంట్ల రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొనే అదృష్టం నాకు దక్కినందుకు గర్వంగా భావిస్తున్నానన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు నినాదాలతో బడుగుల జీవితాల్లో మార్పుతెచ్చిన యుగపురుషుడి ఆశయసాధనకు కృషిచేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి. పిచ్చయ్య, దర్శి మండల పార్టీ అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షుడు కూరపాటి శ్రీను, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గుంటూరులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

గుంటూరు,మహానాడు:

స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా గుంటూరు పార్లమెంటరీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీ రత్న పాల్గొన్నా రు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పిం





చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నాయకులు కోవెలమూడి నాని(రవీంద్ర బాబు), ఆర్టీసీ మాజీ



చైర్మన్ ఈదుపుగంటి లోకేంద్రనాథ్, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, మానం పద్మశ్రీ, పార్టీ సీనియర్ నాయకులు సుకవాసి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### గుంటూరు టీడీపీ కార్యాలయంలో వేడుకలు

గుంటూరు టీడీపీ కార్యాలయంలో తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు వెస్ట్ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, కోవెలమూడి రవీంద్ర, డేగల ప్రభాకర్, రావిపాటి సాయికృష్ణ తదితరులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

### డొక్కా మాణిక్య వరప్రసాద్ నివాళి

గుంటూరులో ఎన్టీఆర్ జయంతి వేడుకలలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మెరిగల మణికుమార్ పాల్గొని నివాళు లర్పించారు.

# లిక్కర్ స్కామ్ విచారణలో కేసీఆర్ ప్రస్తావన

- మీడియాలో కథనాలను ఖండించిన కవిత న్యాయవాది
- తప్పుగా అన్వయించుకున్నారని మండిపాటు

న్యూఢిల్లీ, మహానాడు: హైకోర్టులో మంగళవారం లిక్కర్ స్కాం విచారణ జరిగింది. అయితే మద్యం విధానం, రిటైల్ వ్యాపారం గురించి కేసీఆర్‌కు కవిత ముందే వివరాలు చెప్పి నట్లు ఈడీ వాదనలు వినిపించిందని మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ ప్రచారాన్ని కవిత న్యాయవాది మోహిత్‌రావు ఖండించారు. ఈడీ వాదనల్లో కేసీఆర్ ప్రస్తావన జరగలేదు. కోర్టులో ఈడీ న్యాయవాదులు ప్రస్తావించింది మాగుంట రాఘవరెడ్డి తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి గురించి అని తెలిపారు. దీనిని కేసీఆర్‌కు అన్వ యించి వార్తలు ప్రసారం చేయడం సరికాదని తెలిపారు. రాఘవ రెడ్డి తండ్రి శ్రీనివాసు లురెడ్డి అంటూ ఈడీ చేసిన వాదనలను కవిత తండ్రి కేసీఆర్ అని మీడియా తప్పుగా అన్వయించిందని తెలిపారు. ఎక్కడా కూడా కేసీఆర్ పేరు రాయలేదని, వాదనల సందర్భంగా ఈడీ ప్రస్తావించిన మాగుంట రాఘవ వాం గ్మూల పత్రాన్ని బహి ర్గతం చేశారు. మాగుంట రాఘవ తన వాంగ్మూలంలో తన తండ్రి శ్రీనివాసు లురెడ్డికి లిక్కర్ కేసులో ఉన్న వారిని పరి చయం చేశానని చెప్పారని తెలిపారు. అయితే కేసీఆర్‌పై కొందరు కావాలని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.





# వినుకొండలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

వినుకొండ,మహానాడు:

పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ ఆయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో వినుకొండ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో తెలుగు దేశం పార్టీ వినుకొండ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జి.వి.ఆంజనేయులు దంపతుల నివాళి

వినుకొండ టీడీపీ అభ్యర్థి జి.వి.ఆంజనేయులు ఎన్టీఆర్ 101వ జయంతి సంద ర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో సతీమణి లీలావతితో కలిసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసుకున్నారు.

# జూన్ 1 నుంచి వాహనదారులకు కొత్త రూల్స్



- మైనర్లు పట్టుబడితే రూ.25,000 జరిమానా
- 25 ఏళ్లు వచ్చే వరకు లైసెన్స్ పొందకుండా ఆంక్షలు

న్యూఢిల్లీ, మహానాడు:

జూన్ 1 నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. నిబంధనలు ఉల్లం ఘించి పట్టుబడితే భారీగా జరిమానాలు విధించనున్నారు. అతివేగంతో వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.1000 నుంచి రూ.2000 వరకు జరిమానా కట్టాల్సి ఉంటుంది. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా వేస్తారు. మైనర్ వాహనం నడిపితే రూ.25 వేలు ఫైన్ వేస్తారు. దాంతో పాటు మైనర్ 25 ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా ఆంక్షలు విధిస్తారు.

# తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

- దేశ రాజకీయాల్లోనే ఆయనొక సంచలనం
- ఆనాడే సంక్షేమ పథకాలను ప్రారంభించారు
- మహిళలకు ఆస్తిహక్కు, యూనివర్సిటీలు అన్న ఘనతే
- పేదలకు జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, పెన్షన్లు ఇచ్చారు
- బీసీలకు ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించారు
- జయంతి వేడుకల్లో టీడీపీ నాయకుల నివాళి
- మంగళగిరి ప్రధాన కార్యాలయంలో వేడుకలు

మంగళగిరి,మహానాడు:

తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్ 101వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగుకు వెలుగు తెచ్చింది ఎన్టీఆర్ అని కొని యాడారు. 1983లో తెలుగుదేశం ప్రభంజనంతో ఢిల్లీకి వణకు పుట్టించి ఢిల్లీలో తెలుగు ఖ్యాతి చాటడన్నారు. ఆడవారికి ఆస్తి హక్కు, పేదవాడికి కూడు, గూడు, గుడ్డ ఇచ్చింది ఎన్టీఆరేనని, ఆయన వేసిన తెలుగుదేశం అనే చెట్టు నేడు మహావృ క్షమైం దన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేయ నుందని.. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని నొక్కి వక్కాణించారు.

### ఎన్టీఆర్ ఆశయాలకు పునరంకితం కావాలి

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి తెలుగువాడు ఎన్టీఆర్‌ను గుర్తుకు తెచ్చు కుంటున్నారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల, నీతి,



నిజాయితీ, నిర్భీతికి ఎన్టీఆర్ మారుపేరు. సినీ రంగానికి ఆయనే రాజు, రారాజు. పౌరాణికం, సాంఘికం ఏదైనా ఆయన పాత్రలో ఒదిగిపోతారు. 60 ఏళ్ల వయసులో చైతన్యరథంపై 35 వేల కిలోమీటర్ల తిరిగిన ప్రపంచంలోనే ఏకైక నాయకుడు ఎన్టీఆర్. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, మాండలిక వ్యవస్థ, పద్మావతి మహిళా యూనివర్శిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు గంగ, హంద్రీ నీవా, గాలేరు నగరి, నిజాం సాగర్ లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎన్టీఆర్ చేశారు. నాడు ఎన్టీఆర్ ప్రారంభిం చిన సంక్షేమ కార్యక్రమాలు నేటికి అమలవుతున్నారు. ఆ మహాను భావుడి ఆశయాలకు మనమందరం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.







### పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ పార్టీ స్థాపించి 42 ఏళ్లు అయింది. తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచానికి వెలుగెత్తి చాటిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ నాడు ప్రారంభించిన పక్కాగృహాలు, పెన్షన్, జనతా వస్త్రాలు లాంటి ఎన్నో పథకాలు దేశం అనుకరించింది. కూటమి రాజకీయాలకు పునాది వేసి జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని నిలువరించిన మహానాయకుడు. ఆయన ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు నాయుడు పార్టీని నడిపించారు. రాబోయే రోజుల్లో లోకేష్ ముందుకు తీసుకువెళుతారు.

### రాజకీయ సంస్కరణలకు పునాది

మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో రాజకీయ సంస్కరణలకు పునాది వేసిన నాయ కుడు ఎన్టీఆర్. నటుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయనకు ఆయనే సాటి. నందమూరి తారక రామారావు ఆశయా లకు అనుగుణంగా పనిచేస్తాను. ఈ కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ మంత్రి కొలుసు పార్థసారధి, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తెలుగురైతు అధ్యక్షుడు శ్రీనివాస ఒడ్డి, అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 29, మే 2024


## మెగాస్టార్‌కి గోల్డెన్ వీసా

యూఏఈ ప్రభుత్వం గోల్డెన్ వీసా మంజూరు చేసిన భారతీయుల జాబితాలో మెగాస్టార్ చిరంజీవి కూడా చేరారు. యుఎఇ సాంస్కృతిక పర్యాటక శాఖ టాలీవుడ్ మెగాస్టార్‌కు ఎంతో ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ వీసాను మంజూరు చేసింది. ఈ వీసా కాలపరిమితి పది సంవత్సరాలు. సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరబ్ ప్రభుత్వం ఇటీవల గోల్డెన్ వీసా మంజూరు చేసింది. ఇప్పుడు చిరంజీవికి ఆ ఘనత దక్కింది. యుఎఇ ప్రభుత్వం మొదటిసారిగా 2019లో గోల్డెన్ వీసా కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చింది. ఈ వీసాకు చాలా ఫీచర్స్ ఉన్నాయి. విశేష వీసా విధానంతో విదేశీయులు జాతీయ స్పాన్సర్ అవసరం లేకుండా తమ దేశంలో నివసించడానికి, పని చేయడానికి లేదా చదువుకోవడానికి వీలు కల్పిస్తుంది. వీసా హోల్డర్లు యుఎఇ ప్రధాన భూభాగంలో వారి వ్యాపారంపై 100 శాతం యాజమాన్యాన్ని కలిగి ఉంటారు.




ఐదు లేదా 10 సంవత్సరాల కాలానికి ఉండే ఈ వీసాలు స్వయంచాలకంగా పునరుద్ధరించుకనే వీలుంది. చిరంజీవి కంటే ముందు ఆయన వారసుడు రామ్ చరణ్, కోడలు ఉపాసన కామినేని.. మేనల్లుడు అల్లు అర్జున్‌కు ఈ గౌరవనీయమైన వీసా మంజూరు అయింది. తాజాగా చిరంజీవికి దక్కిన గౌరవం భారతదేశ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను ఆనందపరిచింది.

## బచ్చలమల్లి ఫెరోషియస్ ఫస్ట్‌లుక్



హీరో అల్లరి నరేష్ తన అప్ కమింగ్ మూవీ 'బచ్చల మల్లి'లో ఇంటెన్స్ రోల్ లో కనిపించబోతున్నారు. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ ఈరోజు విడుదల చేశారు. అల్లరి నరేష్ మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో మ్యాసీ హెయిర్, గడ్డంతో కనిపించారు. నరేష్ ఇంటెన్స్ సీరియస్ లుక్ లో రిక్షా మీద కూర్చుని సిగరెట్ తాగుతూ కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో బాణసంచా కాల్చడం, ఫెరోషియస్ దేవుళ్ల గెటప్‌లతో కూడిన కార్నివాల్‌ను గమనించవచ్చు. హై-వోల్టేజ్ ఫైట్ సీక్వెన్స్‌లోని ఈ అద్భుతమైన ఫస్ట్‌లుక్ పోస్టర్, బచ్చల మల్లి ఇంటెన్స్ యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని సూచిస్తుంది. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తోంది. రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. గ్రాండ్ స్కేల్ లో రూపొందుతున్న బచ్చల మల్లిలో టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. సీతా రామం ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, మానాడు, రంగం, మట్టి కుస్తి చిత్రాలకు పనిచేసిన రిచర్డ్ ఎం నాథన్ డివోపీగా పని చేస్తున్నారు.



## ఇదేదో కొత్తగా కపుల్ సాంగ్

"పుష్ప 2" కోసం పాన్ ఇండియా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, "పుష్ప: ది రైజ్" విజయం తరువాత మరింత అంచనాలను నెలకొల్పింది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇటీవల, "పుష్ప 2" టీమ్ టైటిల్ సాంగ్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పాటకు విశేష స్పందన వచ్చింది. మేకర్స్ ఈ సక్సెస్‌ని కొనసాగిస్తూ, మే 29న ఉదయం 11 గంటల 7 నిమిషాలకు మరో పాటను విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సాంగ్‌లో రష్మిక మందన్నా, అల్లు అర్జున్ తమ స్టెప్పులతో మరింత ఆకట్టుకోబోతున్నారు. దేవిశ్రీ ప్రసాద్ అందించిన ఈ సంగీతం పుష్పరాజ్, శ్రీవల్లి మధ్య ఉన్న కెమిస్ట్రీని హైలెట్ చేయనుంది. అయితే ఇది కాస్త కొత్తగా కపుల్ సాంగ్ అంటూ ప్రమోట్ చేస్తున్నారు. "సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామీ" అనే ఈ పాటలో తన ఐకానిక్ స్టెప్పుతో కూడా ఈ జోడి ఆకట్టుకోబోతోంది.

ఈ కపుల్ సాంగ్ శ్రేయ ఘోషల్ పాడారు, పాట మంచి మెలోడీగా ఉండేలా ఉంది. ఇక రీసెంట్‌గా మరో స్టిల్ విడుదల చేయగా జోడి లేటెస్టు ట్రెండుకు తగ్గట్లే రెడీ అయ్యి రొమాంటిక్ స్టిల్ ఇచ్చారు. చూస్తుంటే ఇది ట్రెండ్ అయ్యేలా ఉందనిపిస్తోంది. "పుష్ప 2"లో మొత్తం 5 పాటలు ఉంటాయని సమాచారం. సుకుమార్, దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రతిసారి హిట్ అని చెప్పవచ్చు. అల్లు అర్జున్‌తో కలిసి వచ్చిన ప్రతి సినిమాకు బెస్ట్ మ్యూజిక్‌తో మెప్పించినట్లు, ఈసారి కూడా అలాగే ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## ఆనంద్ మొహంలో నవ్వు చూడాలనుకుంటున్నా -రష్మిక



ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ "గం..గం..గణేశా". ఆనంద్ సరసన ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్స్ గా కనిపించనున్నారు. ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. "గం..గం..గణేశా" ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. నేషనల్ క్రష్ రశ్మిక మందన్న అతిథిగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో
నేషనల్ క్రష్ రశ్మిక మందన్న మాట్లాడుతూ - "గం..గం..గణేశా" ఈ టీమ్ అందరికీ ఎంత ముఖ్యమో నాకు తెలుసు. మనకంటూ ఒకరి సపోర్ట్ ఉండాలి. సినిమా ఇండస్ట్రీలోకి వచ్చాక నేను అది ఫీలయ్యాను. ఆనంద్ నాకు ఒక బ్రదర్. అతనికి తెలియదు అతని మీద నేను చాలా డిపెండ్ అవుతుంటా. ఈ సినిమా సక్సెస్ అందుకుంటే ఆనంద్ మొహంలో నవ్వు ఉంటుంది. ఆ నవ్వు చూడాలని కోరుకుంటున్నా. "గం..గం..గణేశా" సాంగ్స్ కు నేను డ్యాన్సులు చేశా. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ చాలా బాగుంది. డైరెక్టర్ ఉదయ్ కు ఈ సినిమా బిగ్ సక్సెస్ ఇవ్వాలి. "గం..గం..గణేశా" లో రుద్ర, ఇమ్మాన్యుయేల్ పర్ ఫార్మెన్స్ ఆకట్టుకుంది. ఇమ్మాన్యుయేల్ వీడియోస్ చూస్తే నవ్వు ఆగదు. ప్రొడ్యూసర్స్ వంశీ, కేదార్, అనురాగ్ కు ఈ సినిమా లాభాలు తీసుకురావాలి. బేబి మూవీ చూశాక సాయి రాజేశ్ డైరెక్షన్‌లో తప్పకుండా నటించాలని అనిపించింది. అన్నారు.

## మహా రాగ్ని టీజర్

ప్రముఖ నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం మహారాగ్ని. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో బాలీవుడ్ స్టార్ నటులు కాజోల్, ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. వీరితో పాటు స్టార్ కాస్టింగ్ నసీరుద్దీన్ షా, సంయుక్త మీనన్, జిషు సేన్ గుప్తా, ఆదిత్య సీల్ తదితరలు నటిస్తునారు. ఈ చిత్రం నుంచి తాజాగా టీజర్ విడులైంది. టీజర్ మొదటి షార్ట్ నుంచి చివరి షాట్ వరకు అత్యంత ఉత్కంఠంగా రంజింపజేసింది. ఈ టీజర్ లో ముఖ్యంగా ప్రధాన క్యారెక్టర్ లను ఇంట్రడ్యూస్ చేశారు. ప్రభుదేవా స్వాగ్, యాక్షన్ సీక్వెన్సెస్ అదిరిపోయాయి. బ్యూటీ సంయుక్త మీనన్ చాలా ఇంటెన్స్ పాత్రలో కనిపిస్తున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. అలాగే నసీరుద్దీన్ షా క్యారెక్టర్ ను కూడా రివీల్ చేశారు. ఇక చివరిగా డైనమిక్ లేడీ, బాలీవుడ్ బ్యూటీ కాజోల్ ఎంట్రీనే అద్భుతంగా ఉంది. జాతరలో ఫైట్ చేసే సీన్, తాను చెప్పే డైలాగ్ గూజ్ బమ్స్ తెప్పిస్తున్నాయి. మహా రాగ్ని క్వీన్ ఆఫ్ క్వీన్స్ ట్యాగ్ లైన్ తో వచ్చిన ఈ టీజర్ అశేష ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. ముఖ్యంగా టీజర్ లో విజువల్ ఎఫెక్ట్స్ అత్యద్భుతంగా ఉన్నాయి అని చెప్పవచ్చు. బాలీవుడ్ బాద్షా షారుఖాన్ నటించిన జవాన్ చిత్రానికి పనిచేసిన జీకే విష్ణు మహారాగ్ని చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఫ్రేమ్ లో ఆయన పనితనం గొప్పగా ఆవిష్కరించింది. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకి వెన్నుముక అనేది టీజర్ చూస్తేనే అర్థమవుతుంది. గూస్ బంప్స్ తెప్పించే బిజిఎం అందించాడు.



### నందమూరి తారక రామారావు
## 101వ జయంతి వేడుకలు



నేడు విశ్వవిఖ్యాత పద్మశ్రీ నందమూరి తారక రామారావు గారి 101 వ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు మరియు తెలుగు సినీ ప్రముఖుల తో ఫిలింనగర్‌లో ఎన్టీఆర్ గారి విగ్రహం వద్ద జయంతి వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ప్రముఖులందరూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ నందమూరి మోహన్ కృష్ణ గారు, నందమూరి మోహన్ రూప గారు, ఎమ్మెల్యే శ్రీ మాగంటి గోపీనాథ్ గారు, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శ్రీ కె. ఎల్. దామోదర్ ప్రసాద్ గారు, సెక్రటరీ శ్రీ ప్రసన్న కుమార్ గారు, ఫిలింనగర్ కల్చరల్ కమిటీ సెక్రటరీ శ్రీ మోహన్ ముళ్లపూడి గారు, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ శ్రీ వెల్దండ వెంకటేష్ గారు, యూసఫ్ గూడా కార్పొరేటర్ శ్రీ బండారి రాజ్ కుమార్ పటేల్ గారు, బిజెపి కార్యదర్శి శ్రీ చంద్ర మధు మరియు కొంతమంది ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఎన్టీఆర్ గారు విగ్రహానికి పూలమాలతో సత్కరించి జోహార్ ఎన్టీఆర్ నినాదాన్ని గట్టిగా వినిపించారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి నందమూరి తారక రామారావు గారి 101 వ జయంతి వేడుకలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా నందమూరి మోహన్ కృష్ణ గారు మాట్లాడుతూ మా నాన్నగారు ఎన్టీఆర్ గారు ఎంద రికో స్ఫూర్తిదాయకుడు. ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు పలు సంచలనాలకు స్ఫూర్తి. అలాంటి స్ఫూర్తిదాయక వ్యక్తి 17వ జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇటు సినీ రంగంలోనూ అటు రాజకీయ రంగంలోనూ ఎన్నో పెను సంచలనాలు సృష్టించారు. సినీ ఇండస్ట్రీలో ఆయన వేయని పాత్ర అంటూ లేదు. ఆయన తెలుగువారి ఆత్మగౌరవం కాపాడాలని తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రాజకీయంగా ప్రజలకు ఎంతో సేవ చేశారు. అలాంటి వ్యక్తి ఎప్పటికీ మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అని అన్నారు.

### నందమూరి కళ్యాణ్ రామ్
## ది ఫిస్ట్ ఆఫ్ ఫ్లేమ్

తన తాతగారు విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు గారి జయంతి సందర్భంగా, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు ప్రదీప్ చిలుకూరితో చేస్తున్న తన 21 వ చిత్రం గ్లింప్స్ ని చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నందమూరి కళ్యాణ్‌రామ్21 ని నిర్మిస్తున్నారు. ది ఫిస్ట్ ఆఫ్ ఫ్లేమ్ అనే గ్లింప్స్ కళ్యాణ్ రామ్‌ని యాక్షన్-ప్యాక్డ్ గా సరికొత్త గెటప్ లో ప్రజెంట్ చేసింది. వీడియోలో కళ్యాణ్ రామ్ తన పిడికిలిని చూపించడం తన క్యారెక్టర్ ఎంత పవర్ ఫుల్‌గా వుంటుందో తెలియజేసింది. వీడియోలో పవర్ ఫుల్‌గా కనిపించారు కళ్యాణ్ రామ్. ఈ హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్ విజువల్స్ గ్రాండ్‌గా వున్నాయి. ఈ గ్లింప్స్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ




చిత్రంలో ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో నటించిన విజయశాంతి చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాకి సైన్ చేశారు. ఇది కర్తవ్యం పాత్ర తరహాలో పవర్ ఫుల్ డైనమిక్ పాత్ర కానుంది. ఈ చిత్రంలో సోహెల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144